ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
PRGI REGD No.: TGTEL/26/A4986
పక్కా తెలుగు
5 DOTS NETWORK
అమరావతి | సంపుటి : 01 | సంచిక : 010 | శనివారం | 04-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com
Amaravathi | Volume : 01 | Issue : 010 | Saturday | 04-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri

# చంద్రబాబు విజన్.. టార్గెట్ న్యూ జెన్

## చంద్రబాబు విజన్‌తోనే అభివృద్ధి పథంలో పయనం

6లో..



- నారా లోకేశ్ సమర్థ నాయకత్వంలో యువతకు ఉపాధి
- కూటమి చారిత్రక పాలనలో అమరావతి వేగవంత నిర్మాణం
- పోలవరం ప్రాజెక్టు పూర్తికి చంద్రబాబు సంకల్పం
- పరిపాలనలో సరికొత్త ముద్ర వేస్తున్న నారా లోకేశ్
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సూపర్ సిక్స్ అమలు
- చంద్రబాబు చొరవతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు
- అభివృద్ధి మంత్రంతో 2029లో కూటమి విజయం ఖాయం
- గత వైఫల్యాలను అధిగమిస్తూ దూసుకుపోతున్న కూటమి

రెప్పపాటు కాలంలో రెండేళ్లు ఆవిరి... ఇక మిగిలింది మూడేళ్లే. అధికారంలోకి రావడం ఒక విజయం అయితే... అధికారాన్ని నిలబెట్టుకోవడం అసలు సవాలు. ఎన్నికల హామీలు, అభివృద్ధి వాగ్దానాలు, సంక్షేమ పథకాలతో ప్రజల నుంచి అపారమైన మద్దతు పొందిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పాలనలోని కీలక మలుపు వద్ద నిలిచింది. తొలి రెండేళ్లు విమర్శలకు సమాధానాలు చెప్పే సమయం. కానీ ఇకపై సమాధానాలు కాదు... ఫలితాలే మాట్లాడాల్సిన దశ. అమరావతి నుంచి పోలవరం వరకు... సూపర్ సిక్స్ నుంచి ఉద్యోగాల వరకు... ప్రతి హామీ ఇప్పుడు ప్రజల లెక్కల్లోకి చేరింది. ఇదే సమయంలో ప్రతిపక్షం ఎన్నికల మోడ్‌లోకి అడుగుపెట్టింది. ప్రజల అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ముందున్నది కేవలం పరిపాలనా పరీక్ష కాదు... రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టే పరీక్ష. మరోవైపు నారా లోకేశ్‌ను భవిష్యత్ నాయకుడిగా నిలబెట్టే బాధ్యత కూడా ఇదే కాలంపై ఆధారపడి ఉంది. విజన్‌ను ఫలితాలుగా మార్చగలరా? హామీలను చేతల్లో చూపించగలరా? ప్రజల విశ్వాసాన్ని మరోసారి ఓట్లుగా మలచగలరా? ఈ మూడు సంవత్సరాలే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి. 2029 ఎన్నికల కౌంట్‌డౌన్ ఇప్పటికే మొదలైంది. ఇప్పుడు ప్రతి నిర్ణయం... ప్రతి ప్రాజెక్టు... ప్రతి హామీ... చివరకు ప్రతి అడుగు ప్రజల తీర్పుకు కొలమానంగా మారబోతోంది.



## టాబ్లెట్ ఖరీదు అమెరికాలో 85 వేలు అదే ఇండియాలో ఐతే ₹.35 మాత్రమే!

◆ వైరల్ అవుతున్న లేడీ వ్యాఖ్యలు

భారత్‌లో మందుల ధరలు తక్కువగా ఉండటంపై ఓ అమెరికన్ మహిళ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో "ఇండియన్ వర్సెస్ అమెరికన్ హెల్త్‌కేర్" పేరుతో వీడియో విడుదల చేసిన లిజ్ అనే మహిళ, అమెరికాలో రోగులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే మందు భారత్‌లో చాలా తక్కువ ధరకు లభిస్తోందని చెప్పి రెండు దేశాల ఆరోగ్య వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. (7లో..)




## కోల్‌కతాలో సంచలనం

» తృణమూల్‌లో తారాస్థాయికి తిరుగుబాటు
» పార్టీ కార్యాలయంపై రెబల్ వర్గం ఆధిపత్యం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత విభేదాలు కొత్త మలుపు తీసుకున్నాయి. పార్టీలో తిరుగుబాటు చేస్తున్న రితబ్రత బెనర్జీ వర్గం కోల్‌కతాలోని ప్రధాన పార్టీ కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. పలువురు ఎమ్మెల్యేలతో కలిసి కార్యాలయానికి చేరుకున్న రెబల్ నేతలు గేట్ల తాళాలు మార్చి, కొత్త పోస్టర్లు ఏర్పాటు చేసి, లోపల సమావేశం నిర్వహించారు. ఇకపై ఇదే తమ అధికారిక ప్రధాన కార్యాలయంగా పనిచేస్తుందని ప్రకటించారు.
(వివరాలు 7లో..)




## మన్యం వీరుడికి చిరస్థాయి గౌరవం

### భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు

స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో శాశ్వత ముద్ర వేయబోతోంది. ఉత్తరాంధ్రకు అభివృద్ధి ద్వారంగా రూపుదిద్దుకున్న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు ఖరారు కావడం చారిత్రక నిర్ణయంగా నిలిచింది. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వెలువడిన ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో గర్వాన్ని నింపుతోంది. ఒకవైపు బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచిన మహావీరుడి త్యాగం, ధైర్యం, దేశభక్తికి గుర్తింపుగా ఈ గౌరవం నిలుస్తుండగా, మరోవైపు ప్రపంచంతో ఉత్తరాంధ్రను అనుసంధానించే ఆధునిక మౌలిక వసతి ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టడం ప్రత్యేకత సంతరించుకుంది. చరిత్రను స్మరించుకుంటూనే అభివృద్ధికి కొత్త దిశ చూపించే ఈ నిర్ణయం భావితరాలకు స్ఫూర్తిగా నిలవనుంది. మన్యం పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేస్తూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త గుర్తింపుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిలవబోతోంది. (వివరాలు 3లో..)


2లో..

## ఫుల్ క్లారిటీ

• విదేశీ పేరు ఉన్నా హిందువే • మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు
• మత విశ్వాసమే ప్రధానం:కోర్టు

హిందూ మతాన్ని ఆచరించే వ్యక్తిని కేవలం విదేశీ పేరు లేదా విదేశీ పౌరసత్వం ఆధారంగా హిందువు కాదని చెప్పలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ప్రత్యేక ధ్రువపత్రాలు, అధికారిక వేడుకలు తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. మనస్ఫూర్తిగా హిందూ విశ్వాసాలను అనుసరిస్తూ జీవన విధానాన్ని పాటించే వ్యక్తిని హిందువుగానే గుర్తించాలని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు మత స్వేచ్ఛ, వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించిన అంశాలపై ప్రాధాన్యం సంతరించుకుంది.




## మావిగన్,విజయవాడ..మరి రేపేంటో!


2లో..

» జగన్ తీరుపై పరోక్షంగా సీఎం విమర్శలు
» రాయలసీమను ఉక్కుసీమగా మారుస్తాం
» జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం
» స్టీల్ స్టేట్‌గా ఏపీయే లక్ష్యం: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా దేశంలో అగ్రస్థానంలో నిలపడంతో పాటు రాయలసీమను "ఉక్కుసీమ"గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన సీఎం, రాయలసీమ అభివృద్ధిలో ఇది చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### చంద్రబాబు విజన్‌కు జిందాల్ ప్రశంసలు

ఏపీలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్ అన్నారు.()

కియాతో అభివృద్ధి.. బ్రాహ్మణీ స్టీల్స్‌తో అవినీతి

స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు కొత్త దిశ: చంద్రబాబు

## అమరావతి అవినీతికి బ్లూప్రింట్

### చంద్రబాబుపై సజ్జల ఆరోపణలు

అమరావతి పేరుతో భారీ అవినీతి, స్కామ్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్లూప్రింట్ సిద్ధం చేసుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అమరావతి రాష్ట్రానికి భవిష్యత్తులో ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరావతి కోసం ఖర్చు చేయాలనుకుంటున్న నిధుల్లో పదిశాతం మాత్రమే మావిగన్ అభివృద్ధికి వెచ్చించినా అద్భుత ఫలితాలు సాధించవచ్చని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ ప్రతిపాదించిన మావిగన్ ఆలోచనపై మరోసారి స్పష్టత ఇచ్చారని తెలిపారు. (వివరాలు 2లో..)





## అటు వైసీపీ, ఇటు టీడీపీపై సాయి రెడ్డి విమర్శలు

రాజధాని విషయంలో రెండు పార్టీలకు కౌంటర్లు

రెండు పార్టీలు ప్రజలాలోచనలను పట్టించుకోవడంలా?

ఎన్నికలకు రాజధాని అస్త్రం సరికాదన్న మాజీ ఎంపీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతే రాజధాని అని టీడీపీ చెబుతుండగా, మావిగన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తావిస్తోందని పేర్కొన్నారు. ఈ రెండు రాజకీయ వాదనల మధ్య ప్రజల ప్రయోజనాలే మర్చిపోయారని విమర్శించారు. బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను ప్రజల ముందుంచుతున్నానని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా రాజధానిపై స్పష్టత లేకపోవడం అందరూ ఆలోచించాల్సిన విషయమని అన్నారు. (వివరాలు 2లో..)



## పోకిరి డైలాగ్‌తో జగన్‌పై పంచ్

జమ్మలమడుగులో ఆది హాట్ కామెంట్స్

సినిమా డైలాగులు చాలా సందర్భాల్లో రాజకీయ వేదికలపై కూడా వినిపిస్తుంటాయి. అలాంటి గుర్తుండిపోయే డైలాగ్‌లలో సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాలోని "ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో... ఆడే పండుగాడు!" అనే డైలాగ్ ఒకటి. రెండు దశాబ్దాల తర్వాత అదే డైలాగ్ మరోసారి రాజకీయ సభలో వినిపించింది. ఈసారి వేదిక వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు. స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. (వివరాలు 2లో..)



7లో..

## ఆత్మరక్షణ..హత్య..చట్టం!

◆ మామను చంపిన కోడలు... నేరస్తురాలా.. ?
◆ లేక తన గౌరవాన్ని కాపాడుకున్న మహిళా..?
◆ చెన్నై ఘటనతో చట్టపరమైన చర్చ



## ఏపీటీడీసీ కీలక నిర్ణయం

◆ రుషికొండ ప్రాజెక్టుకు కొత్త రూపు
◆ ప్రైవేట్ భాగస్వామ్యానికి గ్రీన్ సిగ్నల్
◆ ఆపరేషన్, నిర్వహణకు కొత్త విధానం

విశాఖపట్నంలోని రుషికొండ హిల్‌టాప్ ప్రాజెక్టు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఏపీటీడీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ బాధ్యతలను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఈఓఐకు ఆహ్వానం పలుకుతూ ప్రకటన విడుదల చేసింది. లీజ్, ఆపరేషన్, మెయింటెనెన్స్ విధానంలో ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. (వివరాలు 2లో..)

# మావిగన్, విజయవాడ..మరి రేపేంటో!

- జగన్ తీరుపై పరోక్షంగా సీఎం విమర్శలు
- రాయలసీమను ఉక్కుసీమగా మారుస్తాం
- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం
- స్టీల్ స్టేట్‌గా ఏపీయే లక్ష్యం: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా దేశంలో అగ్రస్థానంలో నిలపడంతో పాటు రాయలసీమను "ఉక్కుసీమ"గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన సీఎం, రాయలసీమ అభివృద్ధిలో ఇది చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**• రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభం**

రాయలసీమకు కొత్త యుగం ప్రారంభమైందని చంద్రబాబు అన్నారు. దేశంలో తొలిసారిగా గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంతో పాటు రాయలసీమ కూడా ఉక్కు పరిశ్రమలకు కేంద్రంగా మారుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామని వెల్లడించారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతపురంలో కియా పరిశ్రమ రావడంతో ఆ ప్రాంతం రూపురేఖలు మారాయని గుర్తు చేస్తూ, ఇప్పటివరకు అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని తెలిపారు.

**• పాత ప్రభుత్వంపై విమర్శలు**

స్టీల్ ప్లాంట్ పేరుతో గతంలో ఐరన్ ఓర్ దోపిడీ జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు శంకుస్థాపనలు చేసినా నిర్మాణ పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. 2019, 2023లో భూమిపూజలు చేసినప్పటికీ ఒక్క నిర్మాణం కూడా చేపట్టలేదన్నారు. తమ ప్రభుత్వం అడ్డంకులన్నీ తొలగించి 1,100 ఎకరాల భూమిని కేటాయించిందని చెప్పారు. రెండు దశల్లో రెండు మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు.



**• రాయలసీమ అభివృద్ధిపై హామీ**

రాయలసీమను కరవు ప్రాంతంగా కాకుండా జలకళతో నిండిన ప్రాంతంగా మార్చుతామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం ఇప్పటికే హార్టికల్చర్ హబ్‌గా ఎదుగుతోందని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ కొత్త దిశగా సాగుతోందన్నారు. రాళ్లసీమ అనే పేరుకు బదులుగా రత్నాలసీమగా నిలిచేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

**• రాజధానిపై రేపేమంటారా?**

అమరావతిని రాజధానిగా అందరూ అంగీకరించిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పరోక్షంగా జగన్‌పై విమర్శలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మహిళల భద్రత విషయంలో రాజీ ఉండదని, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రసంగంలో చంద్రబాబు రాజకీయ అంశాలపై కూడా స్పందించారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని అన్నారు. సీమలో పారాల్సింది రక్తం కాదని, సాగునీరు కావాలని వ్యాఖ్యానించారు. విధ్వంస రాజకీయాలతో రాష్ట్రానికి నష్టం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పాల్గొన్నారు.

# కియాతో అభివృద్ధి... బ్రాహ్మణీ స్టీల్స్‌తో అవినీతి

**• స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు కొత్త దిశ: చంద్రబాబు**

రాయలసీమ అభివృద్ధికి పరిశ్రమలే ప్రధాన బలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగులో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. రాయలసీమ ఇక కరవు ప్రాంతం కాదని, జలకళతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని చెప్పారు. హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, గోల్డ్ ఫీల్డ్స్, ఆటోమొబైల్, డ్రోన్లు, రక్షణ రంగ పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ ఆధారంగా ఉక్కు ఉత్పత్తి చేసే ఈ స్టీల్ ప్లాంట్ రాయలసీమ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని తెలిపారు.

**• కియా విజయాన్ని గుర్తుచేసిన సీఎం**

2017లో తీవ్ర పోటీ మధ్య అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకొచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. 536 ఎకరాల భూమి కేటాయించి, అవసరమైన నీటి సదుపాయాలు కల్పించి పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. ప్రస్తుతం కియా సంస్థ 19 లక్షల కార్లను ఉత్పత్తి చేయగా, అందులో మూడు లక్షల కార్లు 90 దేశాలకు ఎగుమతి అయ్యాయని తెలిపారు. కియా రాకతో అనంతపురం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు, ప్రాంతానికి ఆర్థికాభివృద్ధి రెండూ సాధ్యమవుతాయని వ్యాఖ్యానించారు.

**• బ్రాహ్మణీ స్టీల్స్‌పై విమర్శలు**

బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో గతంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 2007లో 14 వేల ఎకరాల భూములు కేటాయించినా స్టీల్ ప్లాంట్ మాత్రం నిర్మించలేదన్నారు. క్యాప్టివ్ మైనింగ్ పేరుతో ఓబుళాపురం గనుల నుంచి ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు అక్రమంగా తరలించారని విమర్శించారు. రాష్ట్రానికి ఉపయోగపడాల్సిన సహజ సంపదను దోపిడీ చేశారని ఆరోపించారు. చివరకు అక్రమాలకు పాల్పడిన వారు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. బ్రాహ్మణీ స్టీల్స్ ఘటన అవినీతికి నిదర్శనమైతే, కియా పరిశ్రమ అభివృద్ధికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

# చంద్రబాబు విజన్‌కు జిందాల్ ప్రశంసలు

**■ ఏపీలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్ అన్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్, నియో ఎనర్జీ ప్లాంట్, విజయనగరం పారిశ్రామిక పార్కు పనుల ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించే నాయకత్వం చంద్రబాబుదని కొనియాడారు. దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే నాయకుడితో కలిసి పనిచేయడం తనకు పారిశ్రామికవేత్తగా గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

**రూ.50 వేల కోట్ల పెట్టుబడులు**

రాయలసీమలో నిర్మాణంలో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని సజ్జన్ జిందాల్ వెల్లడించారు. ఏడాదికి రెండు మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ రూపుదిద్దుకుంటోందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమల విస్తరణతో ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరఫున దాదాపు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సజ్జన్ జిందాల్ ప్రకటించారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 50 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ సంస్థ ప్రభుత్వం సహకారంతో పనిచేస్తుందని చెప్పారు.

**పారిశ్రామిక ప్రాజెక్టులపై సీఎం ఆసక్తి**

కార్యక్రమానికి ముందు స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, మినియేచర్ నమూనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు వివరాలను సజ్జన్ జిందాల్ సీఎంకు వివరించారు. పారిశ్రామిక పార్కు సమీపంలో పర్యాటక రిసార్ట్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ ప్లాంట్‌లో అభివృద్ధి చేసిన



డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ సాంకేతికతపై కూడా చంద్రబాబు ఆసక్తి కనబరిచారు. తిరుపతి స్పేస్ సిటీ, కర్నూలు డ్రోన్ సిటీలో అందుబాటులో ఉన్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి విపత్తులు, రక్షణ అవసరాలకు ఉపయోగించే ప్రత్యేక వాహనాన్ని సజ్జన్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు.

# పోకిరి డైలాగ్‌తో జగన్‌పై పంచ్

**జమ్మలమడుగులో ఆది హాట్ కామెంట్స్**

సినిమా డైలాగులు చాలా సందర్భాల్లో రాజకీయ వేదికలపై కూడా వినిపిస్తుంటాయి. అలాంటి గుర్తుండిపోయే డైలాగ్‌లలో సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాలోని "ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో... ఆడే పండుగాడు!" అనే డైలాగ్ ఒకటి. రెండు దశాబ్దాల తర్వాత అదే డైలాగ్ మరోసారి రాజకీయ సభలో వినిపించింది. ఈసారి వేదిక వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు. స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

**• జగన్‌పై ఘాటు వ్యాఖ్యలు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రసంగించిన బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తన ప్రసంగంలో పోకిరి డైలాగ్‌ను ప్రస్తావించారు. ఆ తర్వాత ఆ డైలాగ్‌ను చంద్రబాబుకు అన్వయిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై రాజకీయ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు కోలుకోలేని రాజకీయ దెబ్బ కొట్టింది చంద్రబాబేనని అన్నారు. 2029 ఎన్నికల్లో కూడా జగన్‌ను మరోసారి ఓడించే శక్తి చంద్రబాబుకే ఉందని వ్యాఖ్యానించారు.

**• రాజకీయంగా పెరిగిన ప్రాధాన్యం**

ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలకు సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు వినిపించాయి. ఆయన ప్రసంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆసక్తిగా గమనించారు. స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన సభలో అభివృద్ధి అంశాలతో పాటు రాజకీయ వ్యాఖ్యలు కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా జగన్ సొంత జిల్లా కడపలోనే ఆయనపై నేరుగా విమర్శలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



**•ఆది వ్యాఖ్యలతో జిల్లాలో హీట్**

ఒకప్పుడు వైసీపీలో కీలక నాయకుడిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న ఆయన చేసిన వ్యాఖ్యలు కడప జిల్లా రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో కూడా చర్చకు దారితీశాయి. స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవం అభివృద్ధి కార్యక్రమంగా జరిగినప్పటికీ, సభ ముగిసిన తర్వాత కూడా పోకిరి డైలాగ్, జగన్‌పై చేసిన వ్యాఖ్యలే రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# అమరావతి అవినీతికి బ్లూప్రింట్

**◆ చంద్రబాబుపై సజ్జల ఆరోపణలు**

అమరావతి పేరుతో భారీ అవినీతి, స్కామ్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్లూప్రింట్ సిద్ధం చేసుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అమరావతి రాష్ట్రానికి భవిష్యత్తులో ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరావతి కోసం ఖర్చు చేయాలనుకుంటున్న నిధుల్లో పదిశాతం మాత్రమే మావిగన్ అభివృద్ధికి వెచ్చించినా అద్భుత ఫలితాలు సాధించవచ్చని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ ప్రతిపాదించిన మావిగన్ ఆలోచనపై మరోసారి స్పష్టత ఇచ్చారని తెలిపారు.

**• అమరావతిపై ప్రశ్నలు**

ప్రపంచ స్థాయి రాజధాని అంటూ ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు అమరావతిని మున్సిపాలిటీ స్థాయికి పరిమితం చేస్తున్నారని సజ్జల విమర్శించారు. రాజధాని నిర్మాణానికి ప్రభుత్వ భూమి ఉండటం ఉత్తమమని వైఎస్ జగన్ ఎప్పటి నుంచో చెబుతున్నారని గుర్తు చేశారు. అమరావతి నేల భారీ నిర్మాణాలకు అనుకూలం కాదని గతంలో పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారని అన్నారు. అమరావతి పూర్తిచేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. వైఎస్ జగన్ లేవనెత్తిన ప్రశ్నలకు టీడీపీ నేతలు సమాధానం చెప్పడం లేదని విమర్శించారు.

**• మావిగన్ ప్రతిపాదనపై వివరణ**

మావిగన్ ప్రాంతంలో తక్కువ వ్యయంతో వేగంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉందని సజ్జల చెప్పారు. అమరావతి కోసం తీసుకొస్తున్న అప్పులు రాష్ట్రంపై భారీ భారం మోపుతాయని వ్యాఖ్యానించారు. రైతులు ఇచ్చిన భూముల్లో లేఅవుట్ల అభివృద్ధి కూడా పూర్తికాలేదని అన్నారు. అమరావతి కోసం తీసుకొచ్చిన రూ.47 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు, మచిలీపట్నం పోర్టు, హంద్రీనీవా కాలువ వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజా అవసరాలపై



పెట్టుబడులు పెట్టడం రాష్ట్రానికి ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు.

**• భారీ వ్యయంపై విమర్శలు**

అమరావతిలో వర్టికల్ డెవలప్‌మెంట్ చేపట్టడాన్ని కూడా సజ్జల ప్రశ్నించారు. విస్తారమైన భూమి అందుబాటులో ఉన్నప్పుడు భారీ అంతస్తుల నిర్మాణాల అవసరం ఏమిటని అన్నారు. చదరపు అడుగుకు భారీ ఖర్చుతో నిర్మాణాలు చేపట్టడం ప్రజాధన దుర్వినియోగమేనని ఆరోపించారు. పనులు పూర్తికాకముందే వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం, మరిన్ని పనులను అప్పగించడం సరైన విధానం కాదని విమర్శించారు.

**• ప్రభుత్వంపై వైసీపీ విమర్శలు**

అమరావతి పేరుతో ప్రజల డబ్బు వృథా అవుతోందని చెప్పినందుకే వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని సజ్జల అన్నారు. మూడు రాజధానుల ప్రతిపాదనలో కూడా అమరావతికి శాసన రాజధానిగా స్థానం కల్పించామని గుర్తు చేశారు. అమరావతి ప్రాధాన్యాన్ని ఎప్పుడూ తగ్గించలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి సమతుల్యంగా జరగాలన్నదే వైఎస్ జగన్ ఆలోచన అని తెలిపారు. అమరావతి, మావిగన్ అంశాలపై ప్రజల ముందే పూర్తి స్థాయి చర్చ జరగాలని సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

# అటు వైసీపీ, ఇటు టీడీపీపై సాయి రెడ్డి విమర్శలు

- రాజధాని విషయంలో రెండు పార్టీలకు కౌంటర్లు
- రెండు పార్టీలు ప్రజలాలోచనలను పట్టించుకోవడంలా?
- ఎన్నికలకు రాజధాని అస్త్రం సరికాదన్న మాజీ ఎంపీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతే రాజధాని అని టీడీపీ చెబుతుండగా, మావిగన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తావిస్తోందని పేర్కొన్నారు. ఈ రెండు రాజకీయ వాదనల మధ్య ప్రజల ప్రయోజనాలే మర్చిపోయారని విమర్శించారు. బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను ప్రజల ముందుంచుతున్నానని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా రాజధానిపై స్పష్టత లేకపోవడం అందరూ ఆలోచించాల్సిన విషయమని అన్నారు.

**• శివరామకృష్ణన్ కమిటీపై ప్రశ్న**

రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు పక్కన పెట్టారో అన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్లు గడిచినా ఇప్పటికీ రాజధాని అంశం రాజకీయ చర్చగానే మిగిలిపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఎన్నికల్లో రాజధాని పేరుతో రాజకీయాలు చేయడం రాష్ట్ర అభివృద్ధికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

**• రైతులు, వీజీటీఎం ప్రతిపాదన**

ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు పూర్తిగా ఇవ్వలేదని విజయసాయిరెడ్డి ఆరోపించారు. రైతుల హక్కులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలను కలిపిన వీజీటీఎం భావన రాష్ట్ర విభజన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని విస్తృత ప్రాంతంలో



అభివృద్ధి చేస్తే ఎలాంటి నష్టం ఉండదని అభిప్రాయపడ్డారు.

**• అవినీతి ఆరోపణలు**

అమరావతి నిర్మాణం పేరుతో భారీ అవినీతి జరుగుతోందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి నిర్మాణంలో వ్యయాన్ని అధికంగా చూపిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో భారీ స్థాయిలో అవినీతికి అవకాశం కల్పించారని ఆరోపిస్తూ, ప్రజలు ముందుగా ఈ అంశాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ వ్యయంలో 25 నుంచి 30 శాతం వరకు అక్రమాలకు ఆస్కారం ఉందని ఆయన ఆరోపించారు.

**• కోర్టును ఆశ్రయిస్తానన్న మాజీ ఎంపీ**

అమరావతి పేరుతో జరుగుతున్న నిర్మాణ వ్యయాలపై పూర్తి వివరాలు సేకరించి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఎస్కలేషన్, నిర్మాణ అంచనాలు, ఖర్చులపై పూర్తి సమాచారంతో కోర్టులో సవాల్ చేస్తానని తెలిపారు. రాజధాని నిర్మాణం అంటే అభివృద్ధి కోసం ఉండాలని, రాజకీయాలు లేదా అవినీతికి వేదిక కాకూడదని అభిప్రాయపడ్డారు. అమరావతి అంశంపై ప్రజల తరఫున తన పోరాటం కొనసాగుతుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

# ఏపీటీడీసీ కీలక నిర్ణయం



- ◆ రుషికొండ ప్రాజెక్టుకు కొత్త రూపు
- ◆ ప్రైవేట్ భాగస్వామ్యానికి గ్రీన్ సిగ్నల్
- ◆ ఆపరేషన్, నిర్వహణకు కొత్త విధానం

విశాఖపట్నంలోని రుషికొండ హిల్‌టాప్ ప్రాజెక్టు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఏపీటీడీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ బాధ్యతలను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఈఓఐకు ఆహ్వానం పలుకుతూ ప్రకటన విడుదల చేసింది. లీజ్, ఆపరేషన్, మెయింటెనెన్స్ విధానంలో ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**• ప్రైవేట్ సంస్థలకు అవకాశం**

ఎంపికైన ప్రైవేట్ సంస్థ హిల్‌టాప్‌లోని ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాజెక్టును ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించారు. రుషికొండ దిగువ భాగంలో ఉన్న మరో తొమ్మిది ఎకరాల భూమిని కూడా అభివృద్ధి పరిధిలోకి తీసుకురానున్నారు. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

**• అందుబాటులో సదుపాయాలు**

ప్రాజెక్టు అభివృద్ధిలో సాధారణ ప్రజల అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిబంధనలు విధించారు. ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా అవకాశం కల్పించారు. రెండు ఖాళీ స్థలాల్లో సుమారు 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలకు అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీ ప్లస్ వన్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. అన్ని పనులు తీరప్రాంత నియంత్రణ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే చేపట్టాలని స్పష్టం చేశారు.

**• wజులై 10 వరకు దరఖాస్తులు**

పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య అవకాశాలను ఈఓఐ ద్వారా అంచనా వేసిన తర్వాత తదుపరి దశలో తుది ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, మౌలిక వసతుల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకు మాత్రమే అర్హత కల్పించనున్నారు. మార్చి 31, 2025 నాటికి సానుకూల నెట్‌వర్త్ కలిగి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈఓఐ దాఖలుకు జులై 10 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్య విధానం తదుపరి టెండర్ దశలో ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.



# ఫుల్ క్లారిటీ

**• విదేశీ పేరు ఉన్నా హిందువే • మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు**
**• మత విశ్వాసమే ప్రధానం:కోర్టు**

హిందూ మతాన్ని ఆచరించే వ్యక్తిని కేవలం విదేశీ పేరు లేదా విదేశీ పౌరసత్వం ఆధారంగా హిందువు కాదని చెప్పలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ప్రత్యేక ధ్రువపత్రాలు, అధికారిక వేడుకలు తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. మనస్ఫూర్తిగా హిందూ విశ్వాసాలను అనుసరిస్తూ జీవన విధానాన్ని పాటించే వ్యక్తిని హిందువుగానే గుర్తించాలని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు మత స్వేచ్ఛ, వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించిన అంశాలపై ప్రాధాన్యం సంతరించుకుంది.

**అమెరికా పౌరురాలి పిటిషన్‌పై తీర్పు**

అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌కు సంబంధించిన కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు, తమిళనాడు హిందూ ధార్మిక, దేవాదాయ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఆమెను "అమెరికన్ క్రైస్తవ మహిళ"గా పేర్కొంటూ జారీ చేసిన ఉత్తర్వులు సరైనవి కావని కోర్టు అభిప్రాయపడింది. లారా ఫ్రాన్సెస్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**విదేశీయులపై అభిప్రాయాలు సరికాదన్న ధర్మాసనం**

విదేశీయులు అంటే తప్పనిసరిగా క్రైస్తవులే అని భావించడం సరైనది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి నిజమైన విశ్వాసంతో హిందూ మతాన్ని అనుసరిస్తూ, హిందూ సంప్రదాయాలను పాటిస్తే అతనికి లేదా ఆమెకు హిందువుగా గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేసింది. వ్యక్తి పేరు, జాతీయత, పౌరసత్వం ఆధారంగా మతాన్ని నిర్ణయించడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది.

**ఆలయ హక్కులపై స్పష్టమైన ఆదేశాలు**

తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు లభించే అన్ని పూజా, దర్శన హక్కులు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌కూ వర్తిస్తాయని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. ఆలయ ఆగమ శాస్త్రాలు, అమలులో ఉన్న నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తులకు కూడా సమాన హక్కులు కల్పించాలని ఆదేశించింది. ఈ తీర్పు మత విశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తూ, విదేశీ పౌరసత్వం లేదా పేరు ఆధారంగా వివక్ష చూపరాదనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మన్యం వీరుడికి చిరస్థాయి గౌరవం

## భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు




స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో శాశ్వతంగా నిలవబోతోంది. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మలిచే భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు ఖరారు కావడం చరిత్రకు లభించిన అత్యున్నత గౌరవంగా భావిస్తున్నారు. ఒకవైపు త్యాగం, ధైర్యం, దేశభక్తికి ప్రతీకగా అల్లూరి వారసత్వం... మరోవైపు ప్రపంచంతో ఉత్తరాంధ్రను అనుసంధానించే అభివృద్ధి ద్వారం. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈ నిర్ణయం మరోసారి ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. మన్యం వీరుడి స్ఫూర్తిని భావితరాలకు చేరవేస్తూనే, ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే చారిత్రక మైలురాయిగా భోగాపురం విమానాశ్రయం నిలవబోతోంది.

### జయంతి వేళ గర్వకారణం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ప్రతి తెలుగు హృదయానికి స్ఫూర్తినిచ్చే సందర్భం. బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచి గిరిజనుల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన మహావీరుడి సేవలను స్మరించుకునే రోజు ఇది. అలాంటి మహనీయుడి పేరును ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితమవుతున్న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఖరారు చేయడం చారిత్రక నిర్ణయంగా నిలిచింది. ఇది కేవలం పేరుపెట్టడం కాదు. చరిత్రను అభివృద్ధితో కలిపిన గౌరవప్రదమైన గుర్తింపు. రాష్ట్ర భవిష్యత్తుకు ప్రతీకగా నిలిచే ప్రాజెక్టుకు స్వాతంత్ర్య సమర యోధుడి పేరు జతకావడం అల్లూరి వారసత్వాన్ని తరతరాలకు చేరవేస్తుంది. అల్లూరి సీతారామరాజు పేరు భారత స్వాతంత్ర్య పోరాటంలో ధైర్యానికి ప్రతీక. రంపా పోరాటం ద్వారా గిరిజనుల హక్కుల కోసం ఆయుధం ఎత్తిన ఆయన త్యాగం భారత చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. అలాంటి మహానుభావుడి పేరును అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇవ్వడం ద్వారా ఆయన పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభించింది. ఉత్తరాంధ్ర నేలపై అడుగుపెట్టే ప్రతి ప్రయాణికుడు అల్లూరి పేరును చూసేలా చేసిన ఈ నిర్ణయం చరిత్రకు శాశ్వత గౌరవం.

### ఉత్తరాంధ్రకు అభివృద్ధి ద్వారం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధి పటాన్ని మార్చే కీలక మౌలిక వసతి ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంది. నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇది కొత్త ఆర్థిక అవకాశాలను తీసుకురానుంది. విమాన రవాణా విస్తరణతో పరిశ్రమలు, పర్యాటకం, వాణిజ్యం, ఎగుమతులు, సేవారంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించే ప్రధాన ద్వారంగా ఈ విమానాశ్రయం నిలవనుంది. సుమారు 2,200 ఎకరాల్లో రూ.4,500 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఆధునిక సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంది. భారీ అంతర్జాతీయ విమానాలు దిగే రన్‌వే, అత్యాధునిక టెర్మినల్, కార్గో సదుపాయాలు, భద్రతా వ్యవస్థలు, ప్రయాణికుల సేవలు సిద్ధంగా ఉన్నాయి. తొలి దశలో ఏటా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరింత విస్తరించేలా రూపకల్పన చేశారు.

### తెలుగు సంస్కృతికి ప్రతిరూపం

ఈ విమానాశ్రయం ప్రత్యేకత ఆధునిక నిర్మాణంలోనే కాదు. టెర్మినల్ రూపకల్పనలో తెలుగు సంస్కృతికి విశేష ప్రాధాన్యం ఇచ్చారు. సంక్రాంతి ముగ్గుల ఆకృతులు, కళంకారి చిత్రాలు, కొండపల్లి కళాఖండాలు, సహజ కాంతిని ఆహ్వానించే గాజు నిర్మాణం విమానాశ్రయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బంగాళాఖాతంలోని ఎగిరే చేప ఆకృతిని స్ఫూర్తిగా తీసుకున్న బాహ్య రూపకల్పన ఉత్తరాంధ్ర ప్రత్యేకతను ప్రతిబింబిస్తోంది. విమానాశ్రయం ప్రారంభంతో పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ కేంద్రాలు, కార్గో సేవలు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ఐటీ సంస్థలు, హోటళ్లు, వ్యాపార కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. ఫార్మా, ఆక్వా, సముద్ర ఆహార ఉత్పత్తులు, వ్యవసాయ ఎగుమతులకు అంతర్జాతీయ మార్కెట్లు మరింత చేరువ కానున్నాయి. స్థానిక యువతకు వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడుతోంది. ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రాజెక్టు గ్రోత్ ఇంజిన్‌గా నిలిచే సామర్థ్యం కలిగి ఉంది.

### చంద్రబాబు చొరవ.. రామ్మోహన్ నాయుడు సమన్వయం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది దశకు చేరుకోవడంలో సీఎం చంద్రబాబునాయుడు చొరవ, కేంద్ర ప్రభుత్వ సహకారం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు సమన్వయం కీలక పాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, అనుసంధాన రహదారుల అభివృద్ధిని వేగవంతం చేయగా, కేంద్ర ప్రభుత్వం అవసరమైన అనుమతులు, విధానపరమైన మద్దతు, సంబంధిత సంస్థల సమన్వయాన్ని అందించింది. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి రామ్మోహన్ నాయుడు నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సాంకేతిక ప్రమాణాలు, భద్రతా అనుమతులు, ప్రయాణికుల సౌకర్యాలు సమయానికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమిష్టి కృషి వల్ల భోగాపురం విమానాశ్రయం అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలో సేవలకు సిద్ధమవుతోంది. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన పేరుతో నిర్మితమవుతున్న ఈ విమానాశ్రయం మరోసారి చర్చనీయాంశమైంది. ఒకవైపు స్వాతంత్ర్య పోరాట చరిత్ర, మరోవైపు ఆధునిక అభివృద్ధి ప్రయాణం ఒకే వేదికపై నిలిచిన అరుదైన సందర్భమిది.

# యుద్ధ జ్వాలల్లో రగులుతున్న ప్రపంచం

## వివేకుడి శాంతి మంత్రం ఎక్కడ?

## ఓ మహాశయా.. మళ్లీ మా కోసం పుట్టవయ్యా!



ప్రపంచం యుద్ధాల మంటల్లో చిక్కుకుని శాంతి కోసం తపిస్తున్న వేళ స్వామి వివేకానంద సందేశం నేటి ప్రపంచానికి ఒక అత్యవసరంగా మారింది. దేశాల మధ్య ఘర్షణలు, మత విద్వేషాలు, హింస, స్వార్థ రాజకీయాలు పెరుగుతున్న సమయంలో మానవత్వం, ధైర్యం, సేవ, సత్యం అనే విలువలే శాశ్వత పరిష్కారమని ఆయన దశాబ్దాల క్రితమే బోధించారు. కేవలం 39 ఏళ్ల జీవితంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయుడి ఆలోచనలు నేటికీ కోట్లాది మందికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. జూలై 4న ఆయన వర్ధంతి సందర్భంగా యువతకు ఇచ్చిన పిలుపు, శాంతి సందేశం, దేశ నిర్మాణంపై చూపిన దారిని మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ప్రపంచ పరిస్థితులే స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### అద్భుత జ్ఞాపకశక్తి.. అపార విజ్ఞానం

1863 జనవరి 12న నరేంద్రనాథ్ దత్తగా జన్మించిన స్వామి వివేకానంద, గురువు శ్రీరామకృష్ణ పరమహంస ప్రభావంతో సన్యాస మార్గాన్ని ఎంచుకున్నారు. కేవలం 39 ఏళ్ల వయసులోనే 1902 జూలై 4న మహాసమాధి పొందినా, ఆయన ఆలోచనలు యుగయుగాల పాటు నిలిచిపోయాయి. రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ స్థాపన ద్వారా సేవను ఆధ్యాత్మిక సాధనగా మార్చారు. భారతీయ సంస్కృతిని ప్రపంచ వేదికపై గర్వంగా నిలబెట్టిన మహనీయుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. స్వామి వివేకానందను "శ్రుతిధరుడు"గా పిలిచేవారు. ఒకసారి చదివిన విషయాన్ని అక్షరాలా గుర్తుంచుకునే అసాధారణ జ్ఞాపకశక్తి ఆయన ప్రత్యేకత. సంస్కృత గ్రంథాలతో పాటు పాశ్చాత్య తత్వవేత్తల రచనలను కూడా లోతుగా అధ్యయనం చేశారు. గ్రంథాలయం నుంచి తీసుకున్న పుస్తకాలను మరుసటి రోజే తిరిగి ఇచ్చేవారు. నిజంగా చదివారా అనే సందేహంతో గ్రంథపాలకుడు అడిగిన ప్రశ్నలకు పుస్తకంలోని పంక్తులను సైతం ఉదహరిస్తూ సమాధానం చెప్పిన ఘటన ఆయన మేధస్సుకు నిదర్శనం.

### జీవితాన్ని మలిచిన కష్టాలు

బీఏ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం కోసం ఇంటింటికీ తిరిగిన రోజులు ఆయన జీవితంలో కీలక మలుపు. నిరుద్యోగం కారణంగా తీవ్ర ఆత్మపరిశీలనలోకి వెళ్లిన సమయంలోనే శ్రీరామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నారు. దక్షిణేశ్వర్ కాళీమాత ఆలయంలో గురువును కలిసిన తర్వాత ఆయన జీవిత దిశ పూర్తిగా మారిపోయింది. వ్యక్తిగత బాధను సమాజ సేవగా మలచుకున్న అరుదైన మహనీయుడిగా ఎదిగారు. భారత భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని స్వామి వివేకానంద బలంగా విశ్వసించారు. దేశాన్ని మార్చాలంటే యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. త్యాగం, క్రమశిక్షణ, సేవాభావం, ధైర్యం కలిగిన యువకులే సమాజాన్ని మార్చగలరని నమ్మారు. "లేచి నిలబడండి... లక్ష్యం చేరే వరకు ఆగొద్దు" అనే ఆయన పిలుపు నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తోంది. పేరు కోసం కాదు, సేవ కోసం పనిచేయాలని ఆయన ఇచ్చిన సందేశం ప్రతి తరానికి మార్గదర్శకం.

### యుద్ధాలకు ప్రత్యామ్నాయం మానవత్వం

మానవుడి అతిపెద్ద శత్రువు భయమని వివేకానంద స్పష్టం చేశారు. భయం బానిసత్వానికి దారి తీస్తుందని, నిర్భయత్వం విజయానికి పునాది అని చెప్పారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం సమానంగా అవసరమని బోధించారు. యువత ముందుగా బలంగా ఎదగాలని, తర్వాతే ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవచ్చని ఆయన అభిప్రాయం. వ్యక్తి బలపడితే కుటుంబం బలపడుతుంది. కుటుంబం బలపడితే దేశం బలపడుతుందనే భావనను ఆయన ప్రతిపాదించారు. దేశాలు ఆధిపత్యం కోసం పోటీ పడితే చివరకు మిగిలేది విధ్వంసమేనని వివేకానంద చాలా ముందుగానే హెచ్చరించారు. శక్తి అహంకారానికి కాదు, మానవ సంక్షేమానికి ఉపయోగపడాలని చెప్పారు. విద్వేషం స్థానంలో ప్రేమ, హింస స్థానంలో కరుణ, స్వార్థం స్థానంలో సేవ నిలవాలని బోధించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న యుద్ధాలు, మత ఘర్షణలు, ద్వేష రాజకీయాలు చూస్తే ఆయన మాటల విలువ మరింత స్పష్టమవుతోంది.

### సత్యమే శాశ్వతం.. నేటి ప్రపంచానికి వివేకుడే దిక్సూచి

యవ్వనం కరిగిపోతుంది. సంపద తగ్గిపోతుంది. కీర్తి మరుగున పడుతుంది. అధికారాలు మారిపోతాయి. చివరకు నిలిచేది సత్యమేనని స్వామి వివేకానంద చెప్పారు. జీవితాన్ని గొప్ప లక్ష్యానికి అంకితం చేసినవారే నిజమైన విజయాన్ని సాధిస్తారని ఆయన విశ్వసించారు. సేవే మతం, మానవత్వమే గొప్ప ఆరాధన, సత్యమే శాశ్వత శక్తి అనే ఆయన తత్వం నేటి సమాజానికి అత్యవసరమైన సందేశంగా నిలుస్తోంది. యుద్ధాలతో చీలిపోతున్న ప్రపంచం, విలువలు కోల్పోతున్న సమాజం, దిశ వెతుకుతున్న యువతకు స్వామి వివేకానంద బోధనలు ఇప్పటికీ వెలుగుదారే. శాంతి, సేవ, ధైర్యం, సత్యం, దేశభక్తి, మానవత్వం అనే ఆరు స్తంభాలపై ఆయన నిర్మించిన ఆలోచనా ప్రపంచం ఎన్నటికీ చెదరని సంపద. ఆయన వర్ధంతి కేవలం స్మరణ దినం కాదు. ప్రతి మనిషి తన జీవితాన్ని సమీక్షించుకునే సందర్భం. ప్రపంచం ఆయుధాల కంటే ఆలోచనలను గౌరవించే రోజే నిజమైన శాంతి సాధ్యమవుతుందని వివేకానంద జీవితమే చెబుతోంది.

# సింధు జలాలపై పాకిస్తాన్‌కు భారత్ క్లారిటీ

## ▪ ఉగ్రవాదం ఆపే వరకు ఒప్పందం పిటీ

సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. సరిహద్దు దాటి ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగుతున్నంత వరకు సింధు జలాల ఒప్పందం అమల్లో ఉండదని విదేశాంగ శాఖ ప్రకటించింది. పాకిస్థాన్ చేస్తున్న హెచ్చరికలు, అంతర్జాతీయ వేదికలపై చేస్తున్న ప్రచారం భారత్ నిర్ణయాన్ని ఏమాత్రం ప్రభావితం చేయవని స్పష్టం చేసింది.

### పహల్గామ్ దాడి తర్వాత నిర్ణయం

2025 ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన తర్వాత భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దాడికి ప్రతిస్పందనగా సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. అప్పటి నుంచి పాకిస్థాన్ ఈ నిర్ణయాన్ని అంతర్జాతీయ సమాజం ముందు తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని భారత్ పేర్కొంది.

### ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి చెప్పాలన్న డిమాండ్

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదానికి పాకిస్థాన్ విశ్వసనీయంగా, శాశ్వతంగా మద్దతు ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. ఆ చర్యలు జరిగే వరకు సింధు జలాల ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం లేదని తెలిపారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఒప్పందం అమలును కోరడం సమంజసం కాదని భారత్ అభిప్రాయపడింది.

### పాక్ వ్యాఖ్యలపై స్పందన

పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఇటీవల సింధు జలాల ఒప్పందం ఇప్పటికీ చెల్లుబాటులోనే ఉందని వ్యాఖ్యానించారు. మరోవైపు మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ ఈ అంశంపై అణు ఆయుధాల ప్రస్తావన చేయడం కూడా వివాదానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలను వ్యూహాత్మక నిపుణులు బాధ్యతారాహిత్యంగా అభివర్ణిస్తున్నారు. ఇలాంటి ప్రకటనలు సమస్య పరిష్కారానికి ఉపయోగపడవని భారత్ పరోక్షంగా సూచించింది.

### ప్రపంచానికి భారత్ సందేశం

1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన సింధు జలాల ఒప్పందం రెండు దేశాల మధ్య నదీ జలాల వినియోగాన్ని నియంత్రిస్తోంది. అయితే ఉగ్రవాదం వంటి అసాధారణ పరిస్థితుల్లో తన సార్వభౌమ హక్కులను వినియోగించుకునే అధికారం భారత్‌కు ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల భారత్, జపాన్ సంయుక్త ప్రకటనలో కూడా పాకిస్థాన్ భూభాగం నుంచి ఉద్భవిస్తున్న సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించాయి. అదే సమయంలో ఆఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా పౌరులు ప్రాణాలు కోల్పోవడాన్ని కూడా భారత్ తీవ్రంగా ఖండించింది. మొత్తంగా చూస్తే, ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి చెప్పే వరకు సింధు జలాల ఒప్పందంపై భారత్ తన నిర్ణయాన్ని మార్చబోదని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

# బియ్యం ధరలకు మళ్లీ మంట



- సామాన్యుడి వంటింటిపై మరో భారం
- మార్కెట్‌లో పెరుగుతున్న ధరలు

రాష్ట్రంలో బియ్యం ధరలు క్రమంగా పెరుగుతుండటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని వారాల్లో సూపర్ ఫైన్, సాధారణ బియ్యం ధరలు 26 కిలోల బస్తాపై రూ.200 నుంచి రూ.300 వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన సమయంలో బియ్యం కూడా ఖరీదవడం కుటుంబాల నెలవారీ ఖర్చులను మరింత పెంచుతోంది. మార్కెట్‌లో ధరలు పెరగడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాల కోసం వెతుకుతున్నారు.

### డిమాండ్ పెరగడంతో మరింత ఒత్తిడి

బియ్యం ధరల పెరుగుదలకు వడ్ల ధరలు పెరగడమే ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే సూపర్ ఫైన్ వడ్ల సాగు ఈసారి తగ్గడంతో సరఫరా పడిపోయింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో అక్కడికి వడ్ల సరఫరా పెరిగింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌లో వడ్ల లభ్యత తగ్గి ధరలు పెరిగాయని మిల్లర్లు వివరిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సూపర్ ఫైన్ బియ్యం వినియోగం గణనీయంగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సాధారణ బియ్యం పొందుతున్న కొందరు లబ్ధిదారులు దానిని విక్రయించి మార్కెట్‌లో సూపర్ ఫైన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారని సమాచారం. రెసిడెన్షియల్ పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకంలో కూడా నాణ్యమైన బియ్యం వినియోగం పెరగడం వల్ల మార్కెట్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడింది.

### ధరల నియంత్రణకు కొత్త ఆలోచనలు

ప్రజాపంపిణీ వ్యవస్థలో స్టీమ్ రైస్ పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ విధానం అమల్లోకి వస్తే రేషన్ బియ్యం తిరిగి మార్కెట్‌కు వెళ్లే పరిస్థితి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలపై కొంత నియంత్రణ సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై ఇంకా అధికారిక నిర్ణయం వెలువడలేదు.

### దేశంలో నిల్వలు పుష్కలం... స్థానికంగా ధరల మంట

దేశవ్యాప్తంగా బియ్యం నిల్వలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ స్థానిక మార్కెట్లలో సరఫరా, డిమాండ్ మధ్య వ్యత్యాసం కారణంగా ధరలు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ కొనుగోళ్లు భారీగా సాగడంతో దేశంలో ఆహార ధాన్యాల కొరత లేదని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో భారత్ ముందంజలో కొనసాగుతోంది. అయినప్పటికీ స్థానికంగా వడ్ల లభ్యత తగ్గడం, కొనుగోలు పోటీ పెరగడం వల్ల సామాన్యుడికి మాత్రం బియ్యం ఖరీదైన వస్తువుగా మారుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న వారాల్లో బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సింధు జలాలపై పాక్‌కు నో స్టేక్

## ▪ ఉగ్రవాదమే ఇస్లామాబాద్ చేస్తోన్న బిగ్ మిస్టేక్

సింధు జలాల ఒప్పందంపై భారత్ తీసుకున్న నిర్ణయానికి పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. అయితే వ్యూహాత్మక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితికి ప్రధాన కారణం పాకిస్థాన్ అనుసరించిన ఉగ్రవాద విధానమే. దశాబ్దాలుగా సరిహద్దు దాటి ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వల్లే భారత్ కఠిన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు.

### భారత్ సహనానికి హద్దులు

1990ల నుంచి పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని భారత్ చాలాకాలం సహనంతో ఎదుర్కొందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, దౌత్యపరమైన సమతుల్యత కారణంగా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని ఒత్తిడి సాధనంగా ఉపయోగించలేదు. అయితే పుల్వామా దాడి, తర్వాత పహల్గామ్ ఉగ్రదాడి వంటి ఘటనలు పరిస్థితిని పూర్తిగా మార్చేశాయి. పహల్గామ్ దాడి తర్వాతే ఒప్పందాన్ని అమలులో నిలిపివేయాలనే నిర్ణయానికి భారత్ వచ్చింది.

### పాకిస్థాన్ అంచనాలు తప్పాయి

మొదట్లో భారత్ నిర్ణయాన్ని పాకిస్థాన్ పెద్దగా పట్టించుకోలేదని విశ్లేషణలు చెబుతున్నాయి. భారత్ నీటి ప్రవాహాన్ని ప్రభావితం చేయలేదని అక్కడి అధికారులు వ్యాఖ్యానించారు. అయితే తర్వాతి పరిణామాలు వారి అంచనాలను తప్పు అని నిరూపించాయి. భారత్ నిర్మించిన ప్రాజెక్టుల కారణంగా నదుల ప్రవాహంలో మార్పులు కనిపించడంతో పాకిస్థాన్ ఆందోళన చెందడం ప్రారంభించిందని నిపుణులు పేర్కొంటున్నారు. సరిపడా నీటి నిల్వలు లేకపోవడం కూడా పాక్‌కు పెద్ద సమస్యగా మారిందని విశ్లేషిస్తున్నారు.



### అంతర్జాతీయ మద్దతు దక్కలేదు

భారత్‌పై అంతర్జాతీయ ఒత్తిడి తీసుకురావడానికి పాకిస్థాన్ అనేక ప్రయత్నాలు చేసింది. సమావేశాలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, విదేశీ దేశాల్లో లాబీయింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మద్దతు దక్కలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ బ్యాంకు కూడా ఈ వివాదంలో జోక్యం చేసుకోవడానికి ముందుకు రాకపోవడం పాకిస్థాన్‌కు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

### పాక్ చేస్తున్న ప్రధాన తప్పు ఇదే

సమస్యకు మూల కారణమైన ఉగ్రవాదాన్ని నిర్మూలించకుండా బెదిరింపులు, యుద్ధ వ్యాఖ్యలు, అణు ఆయుధాల ప్రస్తావనతో భారత్‌ను వెనక్కి తగ్గించవచ్చని పాకిస్థాన్ భావించడం అతిపెద్ద వ్యూహాత్మక తప్పుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ స్పష్టంగా ఉగ్రవాద మౌలిక వసతులను పూర్తిగా తొలగించిన తర్వాత మాత్రమే సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణపై ఆలోచిస్తామని ప్రకటించింది. అదే సమయంలో సాంకేతిక పరిణామాలు, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఒప్పందంలో మార్పులు కూడా అవసరమని పేర్కొంది. ఉగ్రవాదానికి స్వస్తి చెప్పకుండా అంతర్జాతీయ వేదికల్లో ప్రచారం చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, ముందుగా తన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం పాకిస్థాన్‌పై ఉందని వ్యూహాత్మక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కోడిగుడ్డు, చికెన్‌కు రెక్కలు

### సామాన్యుడి బడ్జెట్‌కు భారీ షాక్

### వారాల్లోనే భారీ ధరల పెరుగుదల



రాష్ట్రవ్యాప్తంగా చికెన్, కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే చికెన్ ధర కిలోకు రూ.220 నుంచి రూ.330కు చేరింది. అంటే కిలోపై రూ.110 వరకు పెరిగింది. కోడిగుడ్డు ధర కూడా రూ.6 నుంచి రూ.8.50 వరకు పెరగడంతో ప్రతి కుటుంబంపై అదనపు భారం పడుతోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక గుడ్డు ధర సుమారు రూ.6.83 ఉండగా, రిటైల్‌లో రూ.7 నుంచి రూ.8.50 వరకు విక్రయిస్తున్నారు. రోజువారీ వినియోగంలో ఉండే ఈ రెండు ఆహార పదార్థాల ధరలు పెరగడం ప్రజల బడ్జెట్‌ను తారుమారు చేస్తోంది.

### ఎండలే ప్రధాన కారణం

ఈ ఏడాది వేసవి తీవ్రత అసాధారణంగా ఉండటంతో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. బతికిన కోళ్లు కూడా సరైన మేత తీసుకోక గుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఫలితంగా మార్కెట్‌కు వచ్చే కోళ్లు, గుడ్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. సరఫరా తగ్గినా వినియోగం మాత్రం యథావిధిగా కొనసాగడంతో ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. కొత్త ఉత్పత్తి పూర్తిస్థాయిలో మార్కెట్‌కు చేరే వరకు ధరలు తగ్గే అవకాశం లేదని పౌల్ట్రీ రంగం వర్గాలు చెబుతున్నాయి.

### వినియోగదారులకు ఇబ్బందులు

ధరల పెరుగుదలతో కుటుంబాల నెలవారీ ఆహార వ్యయం పెరిగింది. గతంలో వారానికి ఒకటి రెండు సార్లు చికెన్ కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు వినియోగాన్ని తగ్గిస్తున్నాయి. కూరగాయల ధరలు పెరిగినప్పుడు ప్రత్యామ్నాయంగా గుడ్లను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు గుడ్డు ధర కూడా భారీగా పెరగడంతో ఏది కొనాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గతంలో ఒకేసారి ట్రే గుడ్లు కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు అవసరానికి తగ్గట్టే కొంటున్నాయి.

### వ్యాపారులపై కూడా ప్రభావం

చికెన్‌పై ఆధారపడే హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిన్న ఆహార వ్యాపారులు కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. పెరిగిన ముడిసరుకు ధరలతో వంటకాల ధరలు పెంచాలా, నష్టాలను భరించాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. బేకరీలు, కేక్ తయారీ కేంద్రాలు, జిమ్‌లకు సరఫరా చేసే వ్యాపారులపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి

4
GENERAL NEWS
శనివారం 04 జూలై 2026
www.prabhathakiranam.com




- **మేష రాశి:** అనుకోని ప్రయాణాలకు అవకాశం ఉంది. ఖర్చులను నియంత్రించగలరు. స్పైసీ ఆహారం ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. లౌక్యంగా మాట్లాడటం మేలు.
- **వృషభ రాశి:** వాహన సౌఖ్యం కలుగుతుంది. సమాజంలో గౌరవం పెరుగుతుంది. లక్ష్మీ కటాక్షం ఉంటుంది. భూ సంబంధిత వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.
- **మిథున రాశి:** శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఆకస్మిక నిర్ణయాలకు దూరంగా ఉండటం మంచిది. ఓర్పుతో వ్యవహరించండి. దుర్గమ్మను ఆరాధించడం శుభప్రదం.
- **కర్కాటక రాశి:** ముఖ్యమైన పనులను వాయిదా వేయడం మంచిది. వీధి కుక్కలకు ఆహారం పెట్టండి. హనుమాన్ ఆలయ దర్శనం శుభఫలితాలను ఇస్తుంది.
- **సింహ రాశి:** ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండండి. అవమానకర పరిస్థితులు రాకుండా జాగ్రత్త పడండి. కుటుంబ నిర్ణయాలను అందరి అభిప్రాయంతో తీసుకోండి. సూర్య నమస్కారాలు చేయండి.
- **కన్యా రాశి:** భాగస్వామ్య వ్యాపారాలకు సంబంధించిన నిర్ణయాలను కొంతకాలం వాయిదా వేయండి. సోదర, సోదరీల అభివృద్ధికి సమయం కేటాయిస్తారు. స్పెక్యులేషన్ వ్యాపారాల్లో జాగ్రత్త అవసరం.
- **తులా రాశి:** జీవిత భాగస్వామి నిర్ణయాలను గౌరవిస్తారు. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించండి. మృదువుగా మాట్లాడటం ప్రయోజనకరం.
- **వృశ్చిక రాశి:** ఆహార నియమాలు పాటించడం మంచిది. వృత్తిపరమైన నిర్ణయాలు ఆశ్చర్యకర ఫలితాలను ఇవ్వవచ్చు.
- **ధనస్సు రాశి:** వాహనం నడిపేటప్పుడు వేగాన్ని నియంత్రించండి. మిత్రులతో నిజాయితీగా ఉండండి. టెన్షన్‌కు దూరంగా ఉండి ప్రశాంతంగా ఆలోచించండి.
- **మకర రాశి:** తల్లి చెప్పిన మాటకు విలువ ఇవ్వండి. చిన్న ప్రయాణాలకు అవకాశం ఉంది.
- **కుంభ రాశి:** వృత్తిపరమైన ఖర్చులు ఇతరత్రా లాభిస్తాయి. వాక్కే లక్ష్మిగా భావించండి. తలపెట్టిన కార్యాలు విజయతీరాన్ని చేరుతాయి. లౌక్యంగా మాట్లాడటాన్ని మరింత పెంచాలి.
- **మీన రాశి:** ప్రయాణానికి అవకాశం ఉంది. ఆందోళన చెందకుండా నిదానంగా ఆలోచిస్తే సరైన నిర్ణయాలు తీసుకుంటారు. శరీరానికి చలవ చేసే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది.



టీటీడీ అనుబంధ సంస్థ
సమరసత సిద్ధాంతి
**పులిపాక చంద్రశేఖర్ శర్మ**
శ్రీ చక్ర పంచాంగ కర్త
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్:
9440783005

# రామాలయ చందాల రగడ.. రాజకీయ క్రీనీడ




- హిందువులు ఐక్యంగా ఉండాలన్న ఆర్ఎస్ఎస్
- ప్రధాని మోదీ మౌనం వీడాలన్న కాంగ్రెస్

అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశ రాజకీయాల్లో కొత్త దుమారం రేపుతున్నాయి. ఒకవైపు ఈ వ్యవహారంపై తొలిసారిగా స్పందించిన ఆర్ఎస్ఎస్, హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని పిలుపునిస్తూ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు కాంగ్రెస్ మాత్రం ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేస్తూ, సిట్ దర్యాప్తు నివేదికను వెంటనే ప్రజల ముందుంచాలని పట్టుబడుతోంది. ట్రస్ట్ నిర్వహణ, విరాళాల లెక్కలు, దర్యాప్తు పారదర్శకతపై కాంగ్రెస్ వరుస ప్రశ్నలు సంధిస్తుండగా, రాజకీయ కోణంలో ఈ వివాదాన్ని ఉపయోగించొద్దని ఆర్ఎస్ఎస్ హెచ్చరిస్తోంది. ఇప్పటికే కేసులో అరెస్టులు, నగదు స్వాధీనం వంటి పరిణామాలు చోటుచేసుకోవడంతో దేశవ్యాప్తంగా భక్తుల్లోనూ ఆసక్తి పెరిగింది. రామమందిర నిర్మాణానికి కోట్లాది మంది విశ్వాసంతో ఇచ్చిన విరాళాల వినియోగంపై నిజాలు ఏమిటి? సిట్ దర్యాప్తు ఎటు దారితీస్తుంది? కేంద్ర ప్రభుత్వం, ట్రస్ట్ ఎలాంటి సమాధానం ఇస్తాయి? ఆర్ఎస్ఎస్, కాంగ్రెస్ తాజా వైఖరితో ఈ వివాదం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది.

## హిందువుల ఐక్యతకు ఆర్ఎస్ఎస్ పిలుపు

### చందాల దోపిడీ తర్వాత తొలిసారి స్పందన



అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై తొలిసారిగా అధికారికంగా స్పందించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చింది. ఘటనలో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. (**వివరాలు 5లో..**)

## ప్రధాని మౌనం వీడాలని కాంగ్రెస్ డిమాండ్



అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రామాలయ నిర్మాణానికి పూర్తి కీర్తిని తీసుకున్న ప్రధాని, ఇప్పుడు విరాళాల వివాదంపై కూడా బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే ఈ వ్యవహారంపై (**వివరాలు 5లో..**)



## ఆదర్శం నుంచి అంతర్మథనం వరకు

- అగ్రరాజ్యం అమెరికా అంతర్యుద్ధం వైపునకు
- 250 ఏళ్ల ప్రయాణంలో వెలుగులు.. నీడలు

ఒకప్పుడు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమాన అవకాశాలకు ప్రతీకగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అమెరికా... ఇప్పుడు తీవ్ర రాజకీయ విభజనలు, జాతి వివక్ష చర్చలు, తుపాకీ హింస, వలస విధానాల వివాదాలు, ఆర్థిక అసమానతలు, అంతర్జాతీయ ఆధిపత్య పోటీ మధ్య కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పిన దేశమే నేడు అంతర్గత విభేదాలతో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన అమెరికా, ఇప్పుడు తన ప్రజాస్వామ్య (**వివరాలు 7లో..**)




## మోత తగ్గించం

» చమురు ధరలు ఇప్పుడప్పుడే తగ్గించం
» ట్యాంకులు ఇండియాకు చేరాకే నిర్ణయం
» పెట్రోల్ ధరలపై కుండబద్ధలుకొట్టిన కేంద్రం




## యుద్ధ జ్వాలల్లో.. రగులుతున్న ప్రపంచం

### వివేకుడి శాంతి మంత్రం ఎక్కడ?

### ఓ మహాశయ... మళ్లీ మా కోసం పుట్టవయ్యా!

ప్రపంచం మరోసారి యుద్ధాల అంచున నిలిచింది. ఒకవైపు క్షిపణుల గర్జనలు, మరోవైపు అమాయకుల ఆర్తనాదాలు... శాంతి అనే పదమే చరిత్ర పుస్తకాలకే పరిమితమవుతోందా అనే ప్రశ్న మనసును కలచివేస్తోంది. మతం పేరుతో విద్వేషం, అధికారం కోసం రక్తపాతం, స్వార్థం కోసం మానవత్వాన్ని బలి చేస్తున్న ఈ కాలంలో ప్రపంచానికి మరోసారి ఒక వివేకానందుడు అవసరమనే భావన ప్రతి హృదయంలో మోగుతోంది. బలం అంటే యుద్ధం కాదని, నిజమైన విజయం మనిషిని గెలుచుకోవడమేనని ప్రపంచానికి బోధించిన మహనీయుడి స్వరం ఇప్పుడు అత్యంత అవసరం. తుపాకుల శబ్దాల మధ్య ప్రేమ సందేశం వినిపించాలంటే, ద్వేషపు చీకట్లలో సత్యం వెలిగాలంటే, యువతలో ధైర్యం, సమాజంలో సేవాభావం, దేశాల్లో శాంతి పునరుజ్జీవించాలంటే వివేకానంద ఆలోచనలే మార్గం. అందుకే నేడు ప్రపంచం మౌనంగా ఒకే ప్రార్థన చేస్తోంది... "ఓ మహాశయా... మళ్లీ మా కోసం పుట్టవయ్యా!"

# ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు

- బియ్యం, చికెన్ ధరల మంట
- సామాన్యుడి బడ్జెట్ తంట




కూరగాయలు, పప్పులు, నూనెల ధరలు ఇప్పటికే కుటుంబాల బడ్జెట్‌ను కుదేలు చేశాయి. ఇప్పుడు బియ్యం, చికెన్, కోడిగుడ్ల ధరలు కూడా ఒక్కసారిగా పెరగడంతో సామాన్యుడి వంటింటిపై మరో భారీ భారం పడింది. నెల జీతంతో ఇంటి ఖర్చులను సర్దుబాటు చేసుకునే మధ్యతరగతి, రోజువారీ కూలిపై ఆధారపడే కుటుంబాలు ఏ వస్తువు కొనాలి, ఏది తగ్గించాలనే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. గతంలో వారానికి ఒకసారి చికెన్ కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు దానిని వాయిదా వేస్తుండగా, రోజూ వండే బియ్యం కూడా ఖరీదవడంతో ప్రతి భోజనం ఖర్చు పెరిగింది. పిల్లల పోషకాహారం కోసం కొనుగోలు చేసే కోడిగుడ్లు కూడా అందుబాటుకు దూరమవుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లే ప్రతిసారీ పెరిగిన ధరలు కనిపించడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఆదాయం స్థిరంగా ఉండగా మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు వరుసగా పెరగడం వల్ల కుటుంబాల పొదుపులు కరిగిపోతున్నాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకుని సామాన్యుడికి ఊరట కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### కోడిగుడ్డు, చికెన్‌కు రెక్కలు

- సామాన్యుడి బడ్జెట్‌కు భారీ షాక్
- వారాల్లోనే భారీ ధరల పెరుగుదల

### బియ్యం ధరలకు మళ్లీ మంట

సామాన్యుడి వంటింటిపై మరో భారం
మార్కెట్‌లో పెరుగుతున్న ధరలు

# హరీశ్ వర్సెస్ జూపల్లి..రంగంలోకి భట్టి

## అప్పుల యుద్ధం.. సవాళ్ల రాజకీయాలు

తెలంగాణ రాజకీయాల్లో రాష్ట్ర అప్పుల అంశం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య మొదలైన సవాళ్లు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎంట్రీతో మరింత వేడెక్కాయి. అసెంబ్లీలో చెప్పిన లెక్కలు, కాగ్ నివేదికలు, ఆర్బీఐ గణాంకాలు, ప్రభుత్వ ప్రకటనలు ఇప్పుడు రాజకీయ ఆయుధాలుగా మారాయి. ఒకవైపు ప్రభుత్వం కేసీఆర్ హయాంలో రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం మిగిలిందని ఆరోపిస్తుంటే, మరోవైపు బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల లెక్కల్లోనే భారీ వ్యత్యాసాలు ఉన్నాయని ఎదురుదాడి చేస్తోంది. లెక్కలు తప్పితే రాజీనామా చేస్తానంటూ జూపల్లి సవాల్ విసరగా, అధికారిక గణాంకాలతోనే నిజం తేల్చుకుందామని హరీశ్ రావు ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో కేసీఆర్ బహిరంగ చర్చకు రావాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేయడంతో ఈ వివాదం ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధంగా మాత్రమే కాకుండా అధికార, ప్రతిపక్షాల ప్రతిష్ఠాత్మక పోరుగా మారింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నిజమెవరిది అనే ప్రశ్నకు సమాధానం దొరికే వరకు ఈ రాజకీయ సవాళ్లు కొనసాగనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



### అప్పుల లెక్కలు తేలుద్దాం

- హరీశ్‌కు జూపల్లి సవాల్
- మరోసారి చర్చకు ఆహ్వానం



5లో..

### అప్పుల లెక్కల్లో గందరగోళం

జూపల్లికి హరీశ్ రావు బహిరంగ సవాల్

## రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం

- కేసీఆర్ సమాధానం చెప్పాలన్న భట్టి
- బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం తీవ్ర విమర్శలు

రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపి ఇప్పుడు వాస్తవాలను వక్రీకరిస్తోందని బీఆర్ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులు, బకాయిలు కలిపి రాష్ట్రంపై రూ.8,21,651 కోట్ల (**5లో..**)






## ఖమేనీకి తుది వీడ్కోలు

- టెహ్రాన్‌లో దేశాధినేతలు
- రాజధానిలో అంతిమయాత్ర

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు టెహ్రాన్ సిద్ధమైంది. అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మరణించిన ఖమేనీకి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు, మద్దతుదారులు నివాళులు అర్పిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలకు ప్రపంచ దేశాల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు. (**వివరాలు 5లో..**)

## ఈడీ సంచలన నిర్ణయం

**స్వాధీనం చేసుకున్న విమానం ఈ-వేలం**

దేశంలో తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈవేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ కార్యాలయం స్వాధీనం చేసుకున్న హాకర్ 800ఏ విమానాన్ని ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలానికి పెట్టింది. జూలై 1న నిర్వహించిన ఈవేలంలో విమానం రూ.3 కోట్లకు అమ్ముడైంది. స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. (**వివరాలు 7లో..**)



# సింధు జలాలకు భారత్ రెడ్ సిగ్నల్

## పాక్ ఉగ్రవాదం ఆపితేనే గ్రీన్ సిగ్నల్




### సింధు జలాలపై పాకిస్తాన్‌కు భారత్ క్లారిటీ

ఉగ్రవాదం ఆపే వరకు ఒప్పందం పిటీ

### సింధు జలాలపై పాక్‌కు నో స్టేక్

ఉగ్రవాదమే ఇస్లామాబాద్ చేస్తోన్న బిగ్ మిస్టేక్

సింధు జలాల ఒప్పందం ఇప్పుడు కేవలం నీటి పంపిణీ అంశం కాదు.. భారత్–పాకిస్థాన్ సంబంధాల భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక వ్యూహాత్మక ప్రశ్నగా మారింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంతో సాధారణ ఒప్పందాలు కొనసాగడం సాధ్యం కాదని భారత్ మరోసారి స్పష్టమైన సందేశం ఇచ్చింది. సరిహద్దు దాటి ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు పూర్తిగా నిలిచే వరకు సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ ఉండదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. మరోవైపు అంతర్జాతీయ వేదికలపై భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు ఆశించిన ఫలితం కనిపించడం లేదు. ఉగ్రవాదాన్ని అరికట్టకుండా నీటి హక్కుల కోసం పోరాడటం విశ్వసనీయతను దెబ్బతీస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ తీసుకున్న నిర్ణయం దౌత్యపరంగానే కాదు.. భద్రతా పరంగానూ కొత్త విధానానికి నాంది పలికిందని విశ్లేషిస్తున్నారు. ఉగ్రవాదం, నీటి హక్కులు, అంతర్జాతీయ దౌత్యం పరస్పరం ముడిపడిన ఈ వివాదంలో ఇప్పుడు పాకిస్థాన్ ముందున్న అసలు సవాలు భారత్‌ను ఒప్పించడం కాదు.. ప్రపంచాన్ని నమ్మించడం కాదు.. ముందుగా ఉగ్రవాదంపై తన వైఖరిని మార్చుకోవడమేనన్న అభిప్రాయం బలపడుతోంది.



# మోత తగ్గించం

- చమురు ధరలు ఇప్పుడప్పుడే తగ్గించం
- ట్యాంకులు ఇండియాకు చేరాకే నిర్ణయం
- పెట్రోల్ ధరలపై కుండబద్ధలుకొట్టిన కేంద్రం

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గే అవకాశం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న ఇంధనం రెండు నెలల క్రితం అధిక ధరలకు కొనుగోలు చేసిన ముడి చమురుతో తయారైందని చెప్పారు. ప్రస్తుతం తక్కువ ధరకు లభిస్తున్న చమురు భారత్‌కు చేరి శుద్ధి కేంద్రాల్లో ప్రాసెస్ అయిన తర్వాతే వినియోగదారులకు ధరల తగ్గింపు ప్రయోజనం అందుతుందని స్పష్టం చేశారు.

**•రెండు నెలల ముందే కొనుగోలు ప్రక్రియ**

శుద్ధి సంస్థలు సాధారణంగా ముడి చమురును సుమారు రెండు నెలల ముందుగానే కొనుగోలు చేస్తాయని మంత్రి వివరించారు. అప్పట్లో పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలతో పాటు బీమా, రవాణా వ్యయాలు కూడా భారీగా పెరిగాయని గుర్తు చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్‌కు సుమారు 70 డాలర్ల వద్ద ధరలు ఉన్నప్పటికీ, ఆ చమురు భారత్‌కు చేరడానికి సమయం పడుతుందని తెలిపారు.

**• చమురు సంస్థలపై భారీ భారం**

ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాల్లో భారీ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని హర్‌దీప్ సింగ్ పురి వెల్లడించారు. జూన్ త్రైమాసికంలో మొత్తం అండర్‌రికవరీలు సుమారు రూ.1.89 లక్షల కోట్లకు చేరాయని చెప్పారు. ఇందులో పెట్రోల్‌పై రూ.19,905 కోట్లు, డీజిల్‌పై దాదాపు రూ.1.45 లక్షల కోట్లు, ఎల్పీజీపై రూ.24,148 కోట్ల భారం ఉందని వివరించారు. మొత్తం విక్రయాలపై సుమారు రూ.74,781 కోట్ల నష్టం నమోదైనట్లు తెలిపారు.

**• భవిష్యత్తుకు ముందస్తు సన్నాహాలు**

భవిష్యత్తులో చమురు ధరల మార్పులపై ఆందోళన చెందడం కంటే ముందస్తు సన్నాహాలు అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. ధరలు తక్కువగా ఉన్న సమయంలో ఎక్కువ ముడి చమురును నిల్వ చేసుకోవడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఇతర దేశాలతో ఇంధన సరఫరా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారత్ వద్ద పోర్టులు, రిఫైనరీలు, పైప్‌లైన్లు, వ్యూహాత్మక నిల్వలు కలిపి 76 నుంచి 80 రోజుల అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయని వెల్లడించారు.

**• రష్యాకు ఇంధన ఎగుమతులపై వివరణ**

భారత్ నుంచి రష్యాకు పెట్రోల్ ఎగుమతులపై వచ్చిన ప్రశ్నలకు కూడా మంత్రి స్పందించారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నేరుగా సరఫరా చేయడం కంటే ప్రైవేట్ ట్రేడర్ల ద్వారా కొనుగోళ్లు జరిగి ఉండే అవకాశం ఉందని తెలిపారు. దేశీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించిందని చెప్పారు. మొత్తంగా చూస్తే, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం వినియోగదారులకు శుభవార్తే అయినప్పటికీ, ఆ ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల్లో కనిపించడానికి మరికొంత సమయం పట్టే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఖమేనీకి తుది వీడ్కోలు

- టెహ్రాన్‌లో దేశాధినేతలు
- రాజధానిలో అంతిమయాత్ర

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు టెహ్రాన్ సిద్ధమైంది. అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మరణించిన ఖమేనీకి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు, మద్దతుదారులు నివాళులు అర్పిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలకు ప్రపంచ దేశాల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు. టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ మొసల్లా ప్రాంగణంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఇరాన్ జాతీయ పతాకంతో అలంకరించిన శవపేటిక వద్ద ప్రజలు కన్నీటి నివాళులు అర్పించారు.

**• విదేశీ ప్రతినిధుల రాక**

అంత్యక్రియలకు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, సైన్యాధిపతి అసీం మునీర్‌తో పాటు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం హాజరైంది. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్, సౌదీ అరేబియా ఉప విదేశాంగ మంత్రి, ఆఫ్ఘానిస్థాన్ ప్రతినిధులు కూడా టెహ్రాన్ చేరుకుని నివాళులు అర్పించారు. భారత ప్రతినిధి బృందం కూడా ఖమేనీ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల రాకతో టెహ్రాన్‌లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు.

**• కాల్పుల విరమణ మధ్య కార్యక్రమాలు**

ఇటీవల జరిగిన పశ్చిమాసియా యుద్ధం తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ కొనసాగుతున్న సమయంలో ఈ అంత్యక్రియలు జరుగుతున్నాయి. యుద్ధం ముగిసినా పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి రాలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ నాయకత్వం శాంతి ఒప్పందం అమలుపై అప్రమత్తంగా ఉందని, అవసరమైతే మళ్లీ ప్రతిస్పందిస్తామని ఇప్పటికే హెచ్చరించింది. మరోవైపు లెబనాన్‌లో హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ప్రాంతీయ ఉద్రిక్తత ఇంకా తగ్గలేదని స్పష్టమవుతోంది.

**• జూలై 6న ఖననం**

ఖమేనీ అంతిమయాత్ర పలు దశల్లో నిర్వహించనున్నారు. జూలై 6న అధికారికంగా ఖననం చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అంత్యక్రియలకు రెండు కోట్ల మందికిపైగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మతపెద్దలు, ప్రభుత్వ ప్రతినిధులు, విదేశీ అతిథులు వరుసగా నివాళులు అర్పిస్తున్నారు.

**• ప్రపంచ రాజకీయాలపై ప్రభావం**

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలు, విదేశాంగ విధానంపై ఖమేనీ కీలక ప్రభావం చూపారు. ఆయన మరణంతో పశ్చిమాసియా రాజకీయ సమీకరణాల్లో కొత్త మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సంబంధాలు ఏ దిశగా వెళ్తాయనే అంశంపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఒకవైపు అంతిమయాత్ర భావోద్వేగ వాతావరణంలో సాగుతుండగా, మరోవైపు భవిష్యత్ భద్రత, దౌత్య సంబంధాలు, ప్రాంతీయ స్థిరత్వంపై అంతర్జాతీయ స్థాయిలో విస్తృత చర్చ జరుగుతోంది.



# రామాలయ విరాళాల వివాదం

- హిందువుల ఐక్యతకు ఆర్ఎస్ఎస్ పిలుపు
- చందాల దోపిడీ తర్వాత తొలిసారి స్పందన

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై తొలిసారిగా అధికారికంగా స్పందించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చింది. ఘటనలో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. అదే సమయంలో ఈ వివాదాన్ని ఆసరాగా చేసుకొని హిందూ ధర్మాన్ని, హిందూ సమాజాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి ప్రయత్నాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది.





**భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్న వ్యాఖ్య**

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే వీడియో సందేశం విడుదల చేశారు. తరతరాల పోరాటం, కోట్లాది మంది రామభక్తుల త్యాగాల ఫలితంగా నిర్మితమైన అయోధ్య రామాలయం దేశవ్యాప్తంగా హిందువుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. అలాంటి ఆలయంలో విరాళాల పెట్టెల నుంచి నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటన రామభక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు.

**• దర్యాప్తుపై విశ్వాసం వ్యక్తం**

శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసిందని హోసబలే గుర్తు చేశారు. సిట్ సిఫార్సుల ఆధారంగా ఇప్పటికే చట్టపరమైన చర్యలు ప్రారంభమైనట్లు తెలిపారు. దర్యాప్తులో ఎవరైనా దోషులుగా తేలితే వారికి ఎలాంటి మినహాయింపు లేకుండా కఠిన శిక్షలు విధించాలని స్పష్టం చేశారు.

**• పారదర్శక వ్యవస్థ అవసరం**

ఈ ఘటనను ఒక అసాధారణ సంఘటనగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడింది. ఆలయ నిర్వహణలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆర్థిక వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత, సమర్థవంతమైన పరిపాలన, బాధ్యతాయుతమైన వ్యవస్థలు అమల్లో ఉంటే భక్తుల విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొంది. ట్రస్ట్‌పై ప్రజల్లో ఏర్పడిన సందేహాలకు కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపింది.

**• సహనం పాటించాలని విజ్ఞప్తి**

ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ సమాజం సహనం, సంయమనం పాటించాలని ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చింది. ఈ ఘటనను రాజకీయంగా లేదా సామాజికంగా ఉపయోగించుకోవాలని చూసే హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను అప్రమత్తంగా ఎదుర్కోవాలని కోరింది. ఆలయాల స్వతంత్ర నిర్వహణపై కొనసాగుతున్న ఉద్యమాలపై ఈ వివాదం ప్రభావం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, పారదర్శక దర్యాప్తు ద్వారా నిజాలు వెలుగులోకి రావడం అత్యంత అవసరమని స్పష్టం చేసింది. భక్తుల విశ్వాసాన్ని కాపాడటం, ఆలయాల గౌరవాన్ని నిలబెట్టడం ప్రతి బాధ్యతాయుత సంస్థ కర్తవ్యమని ఆర్ఎస్ఎస్ తన ప్రకటనలో పేర్కొంది.

# ప్రధాని మౌనం వీడాలని కాంగ్రెస్ డిమాండ్



అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రామాలయ నిర్మాణానికి పూర్తి కీర్తిని తీసుకున్న ప్రధాని, ఇప్పుడు విరాళాల వివాదంపై కూడా బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే ఈ వ్యవహారంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

**• ట్రస్ట్ రద్దు చేయాలని డిమాండ్**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ ఏర్పాటుకు ముందు రామాలయ నిర్మాణం పేరిట సేకరించిన సుమారు రూ.1,400 కోట్ల విరాళాల లెక్కలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు. ప్రజల విశ్వాసానికి ద్రోహం జరిగితే ప్రభుత్వం మౌనంగా ఉండకూడదని విమర్శించారు.

**•సిట్ నివేదిక బహిర్గతం చేయండి**

కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాగిణి నాయక్ ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను వెంటనే ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆలయ విరాళాల వ్యవహారంలో అసలు బాధ్యులను ఎందుకు రక్షిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రామాలయ నిర్మాణానికి దేశవ్యాప్తంగా పేదల నుంచి ధనవంతుల వరకు తమ శక్తికి తగ్గట్టు విరాళాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ నిధులు ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తి కాదని స్పష్టం చేశారు.

**• దర్యాప్తుపై అనుమానాలు**

గత 40 రోజుల్లో ఆలయంలో 70 చోరీలు జరిగినట్లు సమాచారం ఉందని కాంగ్రెస్ పేర్కొంది. సీసీటీవీ రికార్డుల భద్రతపై కూడా సందేహాలు ఉన్నాయని తెలిపింది. గత ఐదేళ్లలో జరిగిన ఘటనలకు సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రాలేదని విమర్శించింది. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించింది. ప్రభుత్వ అండ లేకుండా ఇలాంటి పరిణామాలు సాధ్యమా అని కాంగ్రెస్ నిలదీసింది.

**• కొనసాగుతున్న దర్యాప్తు**

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రాథమిక నివేదిక సమర్పించిన తర్వాత ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.80 లక్షల నగదుతో పాటు కొంత విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో ఈ వ్యవహారంపై రాజకీయ విమర్శలు మరింత తీవ్రమవుతున్నాయి. విరాళాల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, ప్రజల విశ్వాసాన్ని కాపాడే విధంగా వాస్తవాలను వెల్లడించాలని కాంగ్రెస్ మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

# అప్పుల లెక్కల్లో గందరగోళం

## జూపల్లికి హరీశ్ రావు బహిరంగ సవాల్

సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తరచూ తన వైఖరి మార్చుకుంటున్నారని ఆరోపించారు. మొదట తెలంగాణ భవన్ వద్ద చర్చకు రమ్మన్నారని, తర్వాత అమరవీరుల స్థూపం అని చెప్పారని, ఇప్పుడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు రమ్మంటున్నారని ఎద్దేవా చేశారు. ముందుగా తనను, కేటీఆర్‌ను చర్చకు ఆహ్వానించి ఇప్పుడు కేసీఆర్‌ను రమ్మంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిరోజూ కొత్త సవాలు, కొత్త వేదిక ప్రకటించడం రాజకీయ గందరగోళానికి నిదర్శనమని అన్నారు.

**• అప్పుల లెక్కల్లో భారీ వ్యత్యాసం**

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పుల విషయంలో కాంగ్రెస్ నేతల మాటల్లోనే విభేదాలు కనిపిస్తున్నాయని హరీశ్ రావు అన్నారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం కింద రూ.1,86,087 కోట్లు అప్పు తీసుకువచ్చిందని అధికారిక లెక్కలు చెబుతుంటే, జూపల్లి మాత్రం రూ.1,77,058 కోట్లు మాత్రమేనని లేఖలో పేర్కొన్నారని గుర్తుచేశారు. ఆ పది వేల కోట్ల తేడా ఎక్కడికి వెళ్లిందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన అప్పుల లెక్కలు నిజమా, మంత్రి జూపల్లి చెప్పిన లెక్కలు నిజమా అని నిలదీశారు.




**• రాజీనామా చేయాలని డిమాండ్**

అసెంబ్లీలో తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇప్పుడు బయట చర్చలకు పిలుస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కాగ్ నివేదిక కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.15 లక్షల కోట్లేనని స్పష్టం చేసిందన్నారు. తాను చెప్పిన లెక్కలు, కాగ్ నివేదికలోని వివరాలు ఒకటేనని తెలిపారు. అసెంబ్లీలో తన ప్రసంగం, ముఖ్యమంత్రి ప్రసంగం, ఆర్బీఐ లెక్కలను జూపల్లికి పంపిస్తానని చెప్పారు. వాటిని పరిశీలించిన తర్వాత కూడా తప్పు తనదేనని నిరూపిస్తే తాను సిద్ధమని, లేకపోతే జూపల్లి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

# అప్పుల లెక్కలు తేలుద్దాం

- హరీశ్‌కు జూపల్లి సవాల్
- మరోసారి చర్చకు ఆహ్వానం

రాష్ట్ర అప్పుల అంశంపై బీఆర్ఎస్ నాయకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు మరోసారి బహిరంగ సవాల్ విసిరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు చర్చకు సిద్ధంగా ఉంటానని ప్రకటించారు. నిజమైన లెక్కలతో వస్తే ప్రజల ముందే వాస్తవాలు తేలిపోతాయని చెప్పారు. రాష్ట్ర అప్పుల అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన జూపల్లి సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ఉదయం చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నందునే నిర్ణయించిన సమయానికి వచ్చానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. తాను వెనక్కి తగ్గే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు.

**• రాజీనామాకు సిద్ధమన్న మంత్రి**

తాను చెబుతున్న అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేస్తానని జూపల్లి ప్రకటించారు. అదే విధంగా తమ లెక్కలు తప్పని తేలితే హరీశ్ రావు రాజీనామా చేస్తారా, బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చకు రాకపోయినా, జూపల్లి లెక్కలు తప్పని మీడియా ముందు చెప్పాలని సవాల్ చేశారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ నాయకులు వేర్వేరు సంఖ్యలు చెప్పారని జూపల్లి ఆరోపించారు. ఒకసారి ఒక లెక్క, మరోసారి మరో లెక్క చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పు ఉందని తాను చెబుతున్నానని అన్నారు. ఈ లెక్కల్లో ఎలాంటి తప్పు లేదని ధైర్యంగా ప్రకటించారు.




**• కార్పొరేషన్ అప్పులపై ప్రశ్నలు**

కార్పొరేషన్ల ద్వారా తీసుకొచ్చిన అప్పులను ఎందుకు బయటపెట్టడం లేదని మంత్రి ప్రశ్నించారు. మిషన్ భగీరథ వంటి పథకాల కోసం చేసిన రుణాలను కూడా రాష్ట్ర అప్పుల్లో పరిగణించాల్సిందేనని అన్నారు. ఆ భారం చివరకు ప్రజలపైనే పడుతుందని పేర్కొన్నారు. పూర్తి ఆర్థిక చిత్రాన్ని దాచిపెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం సరైంది కాదని విమర్శించారు. తాను అబద్ధాలు చెప్పే వ్యక్తిని కాదని జూపల్లి స్పష్టం చేశారు. ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకున్నానని గుర్తు చేశారు. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని చెప్పారు. రాజకీయాల్లో కూడా ప్రజల ముందు నిజాలనే చెబుతానని అన్నారు. రాష్ట్ర అప్పులపై వాస్తవాలు బయటపెట్టేందుకు ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనని మరోసారి స్పష్టం చేస్తూ, ప్రజల ముందు నిజం తేలాలని జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు.

# రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం

- కేసీఆర్ సమాధానం చెప్పాలన్న భట్టి
- బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం తీవ్ర విమర్శలు

రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపి ఇప్పుడు వాస్తవాలను వక్రీకరిస్తోందని బీఆర్ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులు, బకాయిలు కలిపి రాష్ట్రంపై రూ.8,21,651 కోట్ల భారం మిగిల్చారని ఆరోపించారు. ఇప్పుడు ఆ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్**

పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు సమాధానం చెప్పాలని భట్టి డిమాండ్ చేశారు. వివిధ మార్గాల ద్వారా తీసుకున్న రుణాలు, సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం కలిపి రూ.8.21 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు. ఈ అప్పులు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అప్పుల అంశాన్ని తక్కువ చేసి చూపేందుకు కేటీఆర్, హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని సూచించారు.

**హరీశ్ రావుపై ఘాటు వ్యాఖ్యలు**

మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరచిపోయి హరీశ్ రావు మాట్లాడుతున్నారని భట్టి విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై పదేపదే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో కూడా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మరోసారి సవాల్ విసిరారు.

**అప్పుల భారాన్ని తగ్గిస్తున్నామని వెల్లడి**

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం చేసిన అప్పుల్లో ఇప్పటికే రూ.2.08 లక్షల కోట్ల వరకు చెల్లింపులు చేసినట్లు భట్టి తెలిపారు. గతంలో 10 శాతం వరకు వడ్డీతో తీసుకున్న రుణాల కారణంగా రాష్ట్రంపై భారీ భారం పడిందని చెప్పారు. తాము తీసుకున్న చర్యలతో చెల్లించాల్సిన వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.




## భావప్రకటన స్వేచ్ఛకు హద్దులు ఉండాలి: దుర్గేశ్

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతులు ప్రచారం చేసే హక్కు కాదని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వ్యూస్, బ్లాక్‌మెయిలింగ్ కోసం సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. రుషికొండ ప్రాజెక్టును పర్యాటక అభివృద్ధికి వినియోగిస్తామని, ఇందుకోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఆహ్వానించామని తెలిపారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

## ఆర్డీఎఫ్ వినియోగం తప్పనిసరి: పట్టాభిరామ్

సిమెంట్ కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో కనీసం 6 శాతం రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్డీఎఫ్)ను తప్పనిసరిగా వినియోగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సూచించారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన స్వచ్ఛ భారత్ మిషన్ నిబంధనలను ప్రతి కంపెనీ పాటించాలని అన్నారు. ఆర్డీఎఫ్ వినియోగానికి అవసరమైన యంత్రాల ఏర్పాటును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వినియోగంపై ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిబంధనలు పాటించని కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, కాలుష్య నియంత్రణ మండలి హెచ్చరించాయి.

రెప్పపాటు కాలంలో రెండేళ్లు ఆవిరి... ఇక మిగిలింది మూడేళ్లే. అధికారంలోకి రావడం ఒక విజయం అయితే... అధికారాన్ని నిలబెట్టుకోవడం అసలు సవాలు. ఎన్నికల హామీలు, అభివృద్ధి వాగ్దానాలు, సంక్షేమ పథకాలతో ప్రజల నుంచి అపారమైన మద్దతు పొందిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పాలనలోని కీలక మలుపు వద్ద నిలిచింది. తొలి రెండేళ్లు విమర్శలకు సమాధానాలు చెప్పే సమయం. కానీ ఇకపై సమాధానాలు కాదు... ఫలితాలే మాట్లాడాల్సిన దశ. అమరావతి నుంచి పోలవరం వరకు... సూపర్ సిక్స్ నుంచి ఉద్యోగాల వరకు... ప్రతి హామీ ఇప్పుడు ప్రజల లెక్కల్లోకి చేరింది. ఇదే సమయంలో ప్రతిపక్షం ఎన్నికల మోడ్‌లోకి అడుగు పెట్టింది. ప్రజల అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ముందున్నది కేవలం పరిపాలనా పరీక్ష కాదు... రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టే పరీక్ష. మరోవైపు నారా లోకేశ్‌ను భవిష్యత్ నాయకుడిగా నిలబెట్టే బాధ్యత కూడా ఇదే కాలంపై ఆధారపడి ఉంది. విజన్‌ను ఫలితాలుగా మార్చగలరా? హామీలను చేతల్లో చూపించగలరా? ప్రజల విశ్వాసాన్ని మరోసారి ఓట్లుగా మలచగలరా? ఈ మూడు సంవత్సరాలే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి. 2029 ఎన్నికల కౌంట్‌డౌన్ ఇప్పటికే మొదలైంది. ఇప్పుడు ప్రతి నిర్ణయం... ప్రతి ప్రాజెక్టు... ప్రతి హామీ... చివరకు ప్రతి అడుగు ప్రజల తీర్పుకు కొలమానంగా మారబోతోంది.

# చంద్రబాబు విజన్.. టార్గెట్ న్యూజెన్



- నారా లోకేశ్ సమర్థ నాయకత్వంలో యువతకు ఉపాధి
- కూటమి చారిత్రక పాలనలో అమరావతి వేగవంత నిర్మాణం
- పోలవరం ప్రాజెక్టు పూర్తికి చంద్రబాబు సంకల్పం
- పరిపాలనలో సరికొత్త ముద్ర వేస్తున్న నారా లోకేశ్
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సూపర్ సిక్స్ అమలు
- చంద్రబాబు చొరవతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు
- అభివృద్ధి మంత్రంతో 2029లో కూటమి విజయం ఖాయం
- గత వైఫల్యాలను అధిగమిస్తూ దూసుకుపోతున్న కూటమి








రాజకీయాల్లో ప్రజలు ఇచ్చే తీర్పు ఎంత గొప్పదైనా... దానికి ఒక గడువు ఉంటుంది. ఎన్నికల్లో గెలిచిన ఆనందం ఎంతకాలం నిలిచినా... పాలనలో ఫలితాలు కనిపించకపోతే ఆ ఆనందం ఆవిరైపోవడానికి ఎక్కువ సమయం పట్టదు. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో ప్రజలు ఆశతో చూస్తారు. ఆరు నెలలు ఓపిక పడతారు. ఏడాది వరకూ ఎదురుచూస్తారు. రెండో ఏడాది ముగిసే సమయానికి మాత్రం ప్రశ్నించడం మొదలుపెడతారు. "ఏం చేశారు?" అని. ఇక మూడో ఏడాది నుంచి సమాధానాలు కాదు... ఫలితాలే కావాలంటారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి తొలి రెండేళ్ల ప్రయాణం ఇప్పుడు రాజకీయ విశ్లేషణకు కేంద్రబిందువైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడుల వేట, అమరావతి, పోలవరం... ఇలా ప్రతి అంశం ఇప్పుడు ప్రజా కోర్టులో విచారణకు వస్తోంది.

## • చారిత్రక విజయానికి భారీ అంచనాల పరీక్ష

చంద్రబాబుకు ఇది కొత్త అనుభవం కాదు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండుసార్లు, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే ఒకసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. పాలనలోని ఒడిదుడుకులు, ఆర్థిక పరిమితులు, రాజకీయ ఒత్తిళ్లు, అధికార వ్యవస్థలోని సంక్లిష్టత... ఇవన్నీ ఆయనకు తెలిసినవే. అయితే ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎందుకంటే ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం. అంతటి భారీ విజయానికి తగ్గ ఫలితాలు ఇవ్వాలనే అంచనాలు కూడా అంతే భారీగా ఉన్నాయి. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ఒంటరిగా గెలవలేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతు, బీజేపీ సహకారం కలిసి కూటమికి అపూర్వ విజయాన్ని అందించాయి. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ హామీలు ప్రజల్లో భారీ అంచనాలు పెంచాయి. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు... ప్రతి వర్గానికీ ఏదో ఒక హామీ ఇచ్చారు. అందుకే ప్రజలు ఈ ప్రభుత్వాన్ని కేవలం అభివృద్ధి కోసమే కాకుండా సంక్షేమంపై కూడా పరీక్షిస్తున్నారు.

## • హామీల అమలే ప్రభుత్వానికి అసలు అగ్నిపరీక్ష

ఇప్పటివరకు ప్రభుత్వం తన విజయాలను చెప్పుకుంటోంది. పెట్టుబడులు తెచ్చామని చెబుతోంది. పరిశ్రమలు వస్తున్నాయని వివరిస్తోంది. విదేశీ పర్యటనల ద్వారా ప్రపంచ దృష్టిని ఆంధ్రప్రదేశ్‌పై నిలిపామని పేర్కొంటోంది. అయితే ప్రజలు ఇప్పుడు మరో ప్రశ్న అడుగుతున్నారు. పెట్టుబడులు రేపటి ఫలితం. కానీ నేటి హామీల పరిస్థితి ఏమిటి? సూపర్ సిక్స్ హామీల అమలు ఇప్పుడు అతిపెద్ద చర్చగా మారింది.

కొన్ని పథకాలు ప్రారంభమయ్యాయి. కొన్ని పాక్షికంగా అమలవుతున్నాయి. మరికొన్ని ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని కారణంగా చూపుతోంది. ప్రతిపక్షం మాత్రం "హామీలు మరిచిపోయారు" అంటోంది. నిజం ఎక్కడుందో ప్రజలే తేల్చాలి. కానీ ప్రశ్నలు మాత్రం పెరుగుతున్నాయి. పెన్షన్ పథకంలో ప్రభుత్వం గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. నెలకు మూడు వేల రూపాయలుగా ఉన్న సామాజిక భద్రతా పెన్షన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచింది. దివ్యాంగులకు మరింత అధికంగా అందిస్తోంది. ప్రతి నెల మొదటి తేదీన ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తుండటం ప్రభుత్వానికి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అయితే దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడుతోంది. వేల కోట్ల రూపాయల వ్యయం పెరగడంతో ప్రభుత్వం లబ్ధిదారుల అర్హతలను తిరిగి పరిశీలిస్తోంది. అనర్హులను తొలగించాలనే చర్యలు ప్రారంభించింది. మరణించిన వారి పేర్లపై కూడా పెన్షన్లు కొనసాగుతున్నట్లు గుర్తించి వాటిని అరికట్టే ప్రయత్నాలు చేస్తోంది.

## • ఆర్థిక ఒత్తిళ్లు.. పెరిగిపోతున్న అంచనాలు

ఇళ్ల నిర్మాణం మరో పెద్ద పరీక్షగా మారింది. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న లక్షలాది ఇళ్లను పూర్తి చేయడం అంత తేలికైన పని కాదు. అయినప్పటికీ ప్రభుత్వం ఆశించిన వేగంతో ముందుకు వెళ్లలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణ వ్యయాలు, నిధుల కొరత, కాంట్రాక్టు సమస్యలు... ఇవన్నీ పురోగతిని ప్రభావితం చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ లబ్ధిదారులకు మాత్రం ఒక్క ప్రశ్నే ఉంది. "ఇల్లు ఎప్పుడు?"

దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలవుతోంది. అయితే సబ్సిడీ విడుదల ఆలస్యం కావడం మహిళల్లో కొంత అసంతృప్తిని కలిగిస్తోంది. తల్లికి వందనం పథకం కూడా పూర్తిస్థాయిలో కాకుండా దశలవారీగా అమలవుతోంది. కొంతమంది లబ్ధిదారులకు డబ్బులు చేరగా, మరికొందరు ఇంకా ఎదురుచూస్తున్నారు. అత్యంత ఎక్కువ ప్రశ్నలు ఎదుర్కొంటున్న అంశం నిరుద్యోగ భృతి. ఎన్నికల సమయంలో నెలకు మూడు వేల రూపాయల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఆ పథకం పూర్తిస్థాయిలో కనిపించలేదు. అదే విధంగా రైతులకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కూడా ఆశించిన స్థాయిలో అమలు కాలేదని రైతు సంఘాలు చెబుతున్నాయి.

## • హామీల అమలుపై అధికార, ప్రతిపక్ష పోటీ

ప్రభుత్వం మాత్రం ఒక వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి రాష్ట్రాన్ని తీవ్ర అప్పుల ఊబిలోకి నెట్టిందని చెబుతోంది. వేల కోట్ల రూపాయల అప్పుల భారం, ఆదాయ పరిమితులు, కేంద్ర సహకారం అవసరం వంటి అంశాలను ప్రస్తావిస్తోంది. అన్ని పథకాలను ఒకేసారి అమలు చేయడం సాధ్యం కాదని, దశలవారీగా ముందుకు వెళ్తున్నామని వివరిస్తోంది. ప్రతిపక్షం మాత్రం ఈ వివరణలను పూర్తిగా తిరస్కరిస్తోంది. "సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నిస్తోంది. ప్రజలు నమ్మి ఓటు వేశారని, ఇప్పుడు ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆరోపిస్తోంది. అభివృద్ధి విషయానికి వస్తే... అమరావతి మరోసారి కేంద్ర చర్చగా మారింది. ఒకప్పుడు కేవలం గ్రాఫిక్స్ రాజధాని అని విమర్శలు ఎదుర్కొన్న అమరావతి ఇప్పుడు మళ్లీ నిర్మాణ దశలో ఉంది. ప్రభుత్వం 2028 నాటికి తొలి దశ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ పనుల పురోగతి మాత్రం ఆశించినంత వేగంగా లేదనే నివేదికలు వెలువడుతున్నాయి.

## • ప్రభుత్వానికి కీలకం గెలుపు.. మలుపు

చంద్రబాబు ఇప్పటికీ విజన్ ఉన్న నాయకుడిగానే గుర్తింపు పొందుతున్నారు. ప్రపంచ స్థాయి నగరాలు, ఆధునిక మౌలిక వసతులు, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ... ఇవన్నీ ఆయన బలాలు. కానీ ప్రజలు ఇప్పుడు విజన్ మాత్రమే కాదు... ఇంటి ముందు రోడ్డు, చేతికి అందే సంక్షేమం, ఉద్యోగ అవకాశాలు, రైతు ఆదాయం, మహిళల భద్రత, యువత భవిష్యత్తు కూడా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటున్న అసలు సిసలు పరీక్ష ఒక్కటే. గవర్నెన్స్‌ను డెలివరీగా మార్చగలదా? విజన్‌ను ఫలితాలుగా చూపించగలదా? హామీలను వాస్తవంగా నిలబెట్టగలదా? ప్రజల సహనానికీ ఒక గడువు ఉంటుంది. ఎన్నికల విజయానికీ ఒక గడువు ఉంటుంది. రాజకీయ హనీమూన్‌కీ ఒక ముగింపు ఉంటుంది. ఆ ముగింపు ఇప్పటికే వచ్చింది. ఇప్పుడు మొదలైంది డెడ్‌లైన్‌ల పరుగు. ఇక నుంచి ప్రతి నెల... ప్రతి సమీక్ష... ప్రతి హామీ... ప్రతి ప్రాజెక్టు... ప్రతి రూపాయి... ప్రతి నిర్ణయం ప్రజల పరిశీలనలోనే ఉంటుంది.

## • ప్రజల విశ్వాసమే చంద్రబాబుకు సవాలు

2029 ఎన్నికలు ఇంకా దూరంలో ఉన్నా... వాటి కౌంట్‌డౌన్ మాత్రం ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలింది మూడేళ్లు మాత్రమే. ఈ మూడేళ్లలో ప్రభుత్వం చేసిన పనులే చంద్రబాబు రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అదే సమయంలో నారా లోకేశ్ భవిష్యత్ నాయకత్వానికి కూడా ఇవే పునాదులు అవుతాయి. చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. భారీ మెజారిటీలు ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకురాగలవు. కానీ రెండోసారి అదే ప్రజలు మళ్లీ గెలిపించాలంటే... హామీల అమలు, అభివృద్ధి ఫలితాలు, సంక్షేమం చేరిక, ప్రజల నమ్మకం.. ఈ నాలుగు కలిసి పనిచేయాలి. అందుకే ఇప్పుడు చంద్రబాబు ముందున్నది సాధారణ పాలన కాదు. ఇది రాజకీయ కెరీర్‌లో మరో నిర్ణయాత్మక అధ్యాయం. విజన్‌కు పరీక్ష. నాయకత్వానికి పరీక్ష. పరిపాలనకు పరీక్ష. ముఖ్యంగా ప్రజలు ఇచ్చిన అపార విశ్వాసాన్ని నిలబెట్టుకునే పరీక్ష. రెప్పపాటు కాలంలో రెండేళ్ల సమయం ముగిసింది. ఇక మేనిఫెస్టో లోని ప్రతి హామీకి డెడ్‌లైన్ ఉంది. ప్రతి డెడ్‌లైన్ వెనుక ప్రజల తీర్పు ఉంది. ఆ తీర్పే 2029 రాజకీయ చరిత్రను రాయబోతోంది.

## లోకేశ్ భవిష్యత్తుకు కీలకంగా మూడేళ్లు

అంతేకాదు... ఇప్పుడు చంద్రబాబు ఒకరినే కాదు. పవన్ కళ్యాణ్, నారా లోకేశ్‌తో కూడిన త్రిముఖ నాయకత్వాన్ని సమన్వయం చేయాల్సిన పరిస్థితి ఉంది. అధికారంలో భాగస్వాములైన మూడు పార్టీల మధ్య సమతౌల్యం కాపాడటం కూడా అంతే కీలకమైన బాధ్యత. లోకేశ్ పరిపాలనలో తనదైన ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ శైలిని కొనసాగిస్తున్నారు. ఈ ఇద్దరి అంచనాలు, ప్రజల ఆశలు, పార్టీ కార్యకర్తల ఆకాంక్షలు... ఇవన్నీ సమన్వయం చేస్తూ చంద్రబాబు ముందుకు సాగాల్సి ఉంది. రాబోయే మూడేళ్లు ఈ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కాలం. ఇప్పటివరకు చెప్పిన మాటలను ఇక చేసి చూపించాల్సిన దశ వచ్చింది. పెట్టుబడుల ఒప్పందాలు సంతకాల్లోనే ఆగిపోకుండా పరిశ్రమలుగా మారాలి. అమరావతి నిర్మాణం వేగం అందుకోవాలి. పోలవరం పూర్తికి స్పష్టమైన దిశ కనిపించాలి. సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిన పథకాలు అమలులోకి రావాలి. రాజకీయాల్లో ప్రజలు చాలా విషయాలు మరిచిపోతారు. కానీ ఎన్నికల హామీలను మాత్రం అంత తేలికగా మర్చిపోరు. ఎన్నికల మేనిఫెస్టో ప్రతి ప్రభుత్వానికీ ఒక ఒప్పంద పత్రంలాంటిది. అందులోని ప్రతి హామీ అమలుపై ప్రజలు లెక్కలు వేస్తారు. చివరకు బ్యాలెట్ బాక్స్ వద్ద అదే లెక్క తీర్చేస్తారు.



## • రాజధాని వేగమే కూటమికి కీలక పరీక్ష

అధికారుల సమీక్ష ప్రకారం జూన్ నాటికి పూర్తి కావాల్సిన పనుల్లో గణనీయమైన లోటు ఉంది. అనేక కాంట్రాక్టు సంస్థలు లక్ష్యాలకు వెనుకబడ్డాయి. దీంతో నిర్ణయించిన గడువులో రాజధాని సిద్ధమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు రాజకీయ జీవితంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు ఇదే. అందుకే అమరావతి విజయం లేదా వైఫల్యం... రెండూ నేరుగా ఆయన నాయకత్వానికే ఆపాదించబడతాయి. పోలవరం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రతి ప్రభుత్వం ఒక కొత్త డెడ్‌లైన్ ప్రకటిస్తోంది. కానీ ఆ గడువు మళ్లీ మారుతోంది. పనులు జరుగుతున్నప్పటికీ పూర్తి ఎప్పుడు అన్న ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. ఇదే సమయంలో మరో రాజకీయ పరిణామం కూటమిపై ఒత్తిడిని పెంచుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికే ఎన్నికల మోడ్‌లోకి వెళ్లిపోయారు. ప్రజల్లోకి విస్తృతంగా పర్యటిస్తున్నారు. కూటమి హామీలను ప్రధాన ఆయుధంగా మార్చుకుంటున్నారు. ప్రతి సభలో సూపర్ సిక్స్ అమలుపై ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

## • లోకేశ్‌కు లైఫ్‌టైమ్ ఛాన్స్... చంద్రబాబుకు మహాపరీక్ష

రాబోయే మూడేళ్లు కేవలం ఒక ప్రభుత్వ పాలనా కాలం మాత్రమే కాదు... తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును నిర్ణయించే కీలక దశ. చంద్రబాబు అనుభవానికి, నారా లోకేశ్ నాయకత్వానికి ఇదే అసలు కొలమానం కానుంది. ప్రజలు ఇప్పుడు మాటలు కాదు... చేతల్లో కనిపించే ఫలితాలనే ఆశిస్తున్నారు. ఒకవైపు ఎన్నికల హామీల అమలు, మరోవైపు ఆర్థిక పరిమితులు, అప్పుల భారం, కేంద్ర సహకారంపై ఆధారపడాల్సిన పరిస్థితులు ప్రభుత్వాన్ని పరీక్షించబోతున్నాయి. అదే సమయంలో అమరావతి, పోలవరం, పరిశ్రమలు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలు ప్రజల అంచనాలకు తగ్గట్టుగా ముందుకు సాగితే... లోకేశ్ పరిపాలనా సామర్థ్యంపై ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడే అవకాశం ఉంది. అది ఆయన వచ్చే మూడు దశాబ్దాల రాజకీయ జీవితానికి బలమైన పునాదిగా మారొచ్చు. అందుకే ఈ మూడేళ్లు చంద్రబాబుకు పరిపాలనా పరీక్ష అయితే... లోకేశ్‌కు రాజకీయ భవిష్యత్తును నిర్మించే గోల్డెన్ ఛాన్స్. 2029లో ప్రజలు వేసే ఓటు... ఈ మూడేళ్ల పనితీరుకే మార్కుల పట్టికగా నిలవనుంది.

**- హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**

# టెక్కలి వైసీపీకి నాయకుడు కావాలి!

- అచ్చెన్నను ఓడించే నాయకుడి కోసం వేట
- ఇప్పటికే సీనియర్లకు సూచించిన జగన్
- కొత్త నాయకుడి కోసం జల్లెడ పడుతున్న నేతలు
- దువ్వాడ-దివ్వెల భవిష్యత్ ఏంటి?

టెక్కలి రాజకీయాల్లో మళ్లీ వేడి రాజుకుంది. బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ వరుస ఎన్నికల్లో విజయం దక్కకపోవడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్థానిక నాయకత్వ వైఫల్యమా? సమన్వయ లోపమా? లేక వ్యూహపరమైన తప్పిదాలా? అనే కోణాల్లో సమీక్ష జరుగుతున్నట్లు సమాచారం. కార్యకర్తల్లో పెరుగుతున్న అసంతృప్తి, ప్రజా సమస్యలపై బలమైన పోరాటం కనిపించకపోవడం, కొత్త నాయకత్వంపై పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో టెక్కలిలో భారీ రాజకీయ మార్పులకు రంగం సిద్ధమవుతోందనే ప్రచారం జోరందుకుంది. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని అభ్యర్థి మార్పు నుంచి కొత్త వ్యూహాల వరకు అనేక అంశాలపై అధిష్టానం కసరత్తు ప్రారంభించినట్లు వినిపిస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో వ్యవహరిస్తున్న పేరాడ తిలక్‌కు ఎన్నికల్లో గెలిచే సత్తా ఉందా లేదా అన్న చర్చ పార్టీలో జరుగా సాగుతోంది. దీంతో టెక్కలి రాజకీయాల్లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. టెక్కలిలో పార్టీ జెండాను నమ్ముకుని పని చేస్తున్న కార్యకర్తలు ప్రతి ఎన్నికలో ఓటమి తర్వాత తీవ్ర నిరాశకు గురవుతున్నారనే అభిప్రాయం వినిపిస్తోంది. ఆర్థికంగా బలహీనపడటంతో పాటు రాజకీయంగా కూడా వెనుకబడుతున్నామనే భావన శ్రేణుల్లో పెరుగుతోందని అంటున్నారు. పార్టీని నమ్ముకోవాలా, స్థానిక నాయకత్వాన్ని నమ్ముకోవాలా అనే సందిగ్ధ పరిస్థితి కొందరు కార్యకర్తల్లో కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.



### సమన్వయంపై ప్రశ్నలు

ప్రస్తుతం టెక్కలి నియోజకవర్గానికి వైసీపీ ఇంఛార్జిగా పేరాడ తిలక్ ఉన్నారు. ఐతే ఆయన పార్టీ క్రియాశీలకంగా చెబుతున్న కార్యక్రమాలకు మాత్రమే ఆయన పరిమితమవుతున్నారు తప్పించి.. వ్యక్తిగతంగా ఆయన క్షేత్ర స్థాయిలో ఎలాంటి కార్యక్రమాలు చేయడం లేదన్న భావన కార్యకర్తల్లో ఉంది. ఫోటోలు, వీడియోలు మాత్రమే కనిపిస్తున్నాయని, ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు కనిపించడం లేదని కొందరు పార్టీ వ్యూహకర్తలు అభిప్రాయపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో వినికిడి ఉంది. పరిపాలనా స్థాయిలో సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని చర్చ జరుగుతోంది. టెక్కలి ప్రాంతంలో గ్రానైట్ యూనిట్లు, క్రషర్లు, ఇతర పరిశ్రమలు మూతపడటం వల్ల అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యలపై పార్టీ నాయకత్వం బలంగా పోరాడడం లేదనే అభిప్రాయం కూడా అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లే నాయకత్వమే పార్టీకి అవసరమని కొందరు సీనియర్ నేతలు సూచించినట్లు తెలుస్తోంది. వచ్చే 2029 ఎన్నికలు టెక్కలి రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత నాయకత్వం చివరిసారి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నట్లు, గెలిస్తే రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని, లేకపోతే రాజకీయాలకు దూరమయ్యే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ అంశంపై అధిష్టానానికి కూడా నివేదిక చేరినట్లు సమాచారం.

### జగన్ వద్దకు ఆశావహుల క్యూ

టెక్కలిలో బలమైన నాయకత్వాన్ని తీసుకురావాలనే ఆలోచనతో అధిష్టానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పార్టీకి పూర్తిగా కట్టుబడి పని చేసే నాయకుడిని ఎంపిక చేయాలనే అభిప్రాయం బలపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు ఆశావహులు అధిష్టానాన్ని కలిసి తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు సమాచారం. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిను కలిసేందుకు టెక్కలి నుంచి పలువురు నాయకులు ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆశావహులందరినీ కలుస్తూ, స్థానిక పరిస్థితులపై వివరాలు తెలుసుకుంటున్నారని సమాచారం. వ్యూహకర్తల అంచనా ప్రకారం టెక్కలి టికెట్ కోసం ఇప్పటికే సుమారు ఎనిమిది మంది పోటీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరికి తెలియకుండా మరొకరు అధిష్టానానికి చేరువయ్యే ప్రయత్నాలు చేస్తుండగా, టెక్కలి రాజకీయ సమీకరణాలను మార్చే నిర్ణయం త్వరలో వెలువడే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అప్పటి వరకు ఆశావహులంతా మౌనంగానే తమ రాజకీయ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు వివాదాస్పదంగా మారిన దువ్వాడ శ్రీనివాస్‌దివ్వెల మాధురి వ్యవహారం కూడా పార్టీలో చర్చకు వస్తోంది. కార్యకర్తలతో మమేకమవుతున్నప్పటికీ... పార్టీతో సంబంధం లేకుండా పని చేస్తోండటాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. మరోవైపు దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి సైతం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్న నేపథ్యంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న చర్చ సాగుతోంది.

### అచ్చెన్నాయుడిని ఢీకొట్టేదెవరు?

టెక్కలి రాజకీయాల భవిష్యత్తు ఇక వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజల ఆకాంక్షల చుట్టూ తిరిగే పరిస్థితి కనిపిస్తోంది. గెలుపు కోసం కొత్త ముఖం తీసుకురావడం ఒక్కటే పరిష్కారం కాదని, ప్రజలతో నిరంతరం మమేకమయ్యే నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే అసలు సవాలని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అచ్చెన్నాయుడు లాంటి సీనియర్ నాయకుడిని ఢీకొట్టేదెవరన్నచర్చ ఇప్పుడు పార్టీలో జరుగో సాగుతోంది. ఇప్పుడున్న నాయకత్వం ఆయనను ఓడించడం సాధ్యం కాదన్న భావన కూడా ఉంది. గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టడం ద్వారా మాత్రమే విశ్వాసాన్ని తిరిగి సంపాదించవచ్చని చెబుతున్నారు. రానున్న రోజుల్లో టెక్కలిలో తీసుకునే ప్రతి రాజకీయ నిర్ణయం నియోజకవర్గ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, అందరి దృష్టి ఇప్పుడు అధిష్టానం తదుపరి అడుగుపైనే నిలిచింది.

# ఆదర్శం నుంచి అంతర్మథనం వరకు

- అగ్రరాజ్యం అమెరికా అంతర్యుద్ధం వైపునకు
- 250 ఏళ్ల ప్రయాణంలో వెలుగులు.. నీడలు

ఒకప్పుడు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమాన అవకాశాలకు ప్రతీకగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అమెరికా... ఇప్పుడు తీవ్ర రాజకీయ విభజనలు, జాతి వివక్ష చర్చలు, తుపాకీ హింస, వలస విధానాల వివాదాలు, ఆర్థిక అసమానతలు, అంతర్జాతీయ ఆధిపత్య పోటీ మధ్య కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పిన దేశమే నేడు అంతర్గత విభేదాలతో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన అమెరికా, ఇప్పుడు తన ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడమే పెద్ద సవాలుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగం, ఆర్థిక శక్తి, సైనిక సామర్థ్యం, ప్రపంచ రాజకీయాల్లో ప్రభావం వంటి అంశాల్లో అమెరికా ఇప్పటికీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. జూలై 4 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 250 ఏళ్ల అమెరికా ప్రయాణాన్ని తిరిగి చూసుకుంటే... స్వేచ్ఛ కోసం సాగిన ఉద్యమం నుంచి ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగిన చరిత్రతో పాటు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## 13 రాష్ట్రాల నుంచి అగ్రరాజ్యంగా

- నేడు అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం
- జూలై 4కు చారిత్రక ప్రాధాన్యం

ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. ప్రతి ఏడాది జూలై 4న అమెరికా ప్రజలు దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తుచేసుకుంటూ వేడుకలు నిర్వహిస్తారు. బాణాసంచా ప్రదర్శనలు, భారీ పరేడ్‌లు, జాతీయ జెండాలతో దేశభక్తిని చాటే కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగుతాయి. 1776 జూలై 4న బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన రోజే అమెరికా చరిత్రలో అత్యంత కీలకమైన మలుపుగా నిలిచింది.

### 13 వలస ప్రాంతాలే తొలి అమెరికా

స్వాతంత్ర్యానికి ముందు అమెరికా ఒకే దేశంగా లేదు. బ్రిటిష్ పాలనలో ఉన్న 13 వలస ప్రాంతాల సమాహారంగా ఉండేది. "ప్రాతినిధ్యం లేకుండా పన్ను లేదు" అనే నినాదంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించారు. ఈ ఉద్యమ ఫలితంగానే 13 వలస ప్రాంతాలు కలిసి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని అమెరికా అనే కొత్త దేశాన్ని ఏర్పాటు చేశాయి. స్వాతంత్ర్య ప్రకటన ముసాయిదాను ప్రధానంగా థామస్ జెఫర్సన్ రూపొందించారు. అమెరికా స్వాతంత్ర్య పోరాటం 1775 నుంచి 1783 వరకు కొనసాగింది. చివరకు 1783లో పారిస్ ఒప్పందంతో అమెరికాను స్వతంత్ర దేశంగా అధికారికంగా గుర్తించారు.

### 50 రాష్ట్రాలుగా విస్తరణ

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అమెరికాలో కేవలం 13 రాష్ట్రాలు మాత్రమే ఉండేవి. తర్వాత కొనుగోళ్లు, యుద్ధాలు, ఒప్పందాల ద్వారా దేశ భూభాగం విస్తరించింది. 1803లో ఫ్రాన్స్ నుంచి లూసియానా



ప్రాంతాన్ని కొనుగోలు చేయడంతో అమెరికా విస్తీర్ణం దాదాపు రెట్టింపైంది. 1819లో స్పెయిన్ నుంచి ఫ్లోరిడా లభించింది. 1845లో టెక్సాస్ విలీనమైంది. మెక్సికోతో జరిగిన యుద్ధం తర్వాత కాలిఫోర్నియా, అరిజోనా, నెవాడా, ఉటా వంటి ప్రాంతాలు అమెరికాలో చేరాయి. 1867లో రష్యా నుంచి అలాస్కాను కొనుగోలు చేశారు. 1959లో హవాయి 50వ రాష్ట్రంగా అవతరించింది. ఈ భౌగోళిక విస్తరణ అమెరికా ఆర్థిక, సైనిక శక్తికి బలమైన పునాదిగా మారింది.

# టాబ్లెట్ ఖరీదు అమెరికాలో 85 వేలు

- అదే ఇండియాలో ఐతే రూ.35 మాత్రమే!
- వైరల్ అవుతున్న లేడీ వ్యాఖ్యానాలు

భారత్‌లో మందుల ధరలు తక్కువగా ఉండటంపై ఓ అమెరికన్ మహిళ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో "ఇండియన్ వర్సెస్ అమెరికన్ హెల్త్‌కేర్" పేరుతో వీడియో విడుదల చేసిన లిజ్ అనే మహిళ, అమెరికాలో రోగులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే మందు భారత్‌లో చాలా తక్కువ ధరకు లభిస్తోందని చెప్పి రెండు దేశాల ఆరోగ్య వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు.

### ఒకే మాత్రకు భారీ ధర తేడా

లిజ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆమె అత్త రక్త క్యాన్సర్ చికిత్స కోసం రెవ్లిమిడ్ అనే ఔషధాన్ని వాడుతున్నారు. అమెరికాలో ఆ బ్రాండెడ్ ఔషధంలోని ఒక్క మాత్ర ధర సుమారు 900 డాలర్లు, అంటే దాదాపు రూ.85 వేల వరకు ఉంటుందని చెప్పారు. అదే ఔషధానికి సమానమైన జనరిక్ వెర్షన్ భారత్‌లో రూ.35 నుంచి రూ.300 మధ్య లభిస్తోందని వెల్లడించారు. ఈ ధరల తేడా చూసిన తర్వాత అమెరికాలో ప్రజలను దోచుకుంటున్నారని అనిపిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

### భారత్ ఆరోగ్య వ్యవస్థపై ప్రశంసలు

భారత్ ప్రపంచంలో అత్యంత చౌకగా మందులు అందించే దేశాల్లో ఒకటని లిజ్ పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు అందుబాటు ధరల్లో చికిత్స లభిస్తోందని చెప్పారు. అమెరికాలో మాత్రం మందుల ధరలు సాధారణ ప్రజలకు భారంగా మారాయని విమర్శించారు. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా భారత్ వ్యవస్థ పనిచేస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

### సోషల్ మీడియాలో స్పందనలు



ఈ వీడియో లక్షలాది మందిని ఆకట్టుకుంది. వేల సంఖ్యలో స్పందనలు వచ్చాయి. అమెరికా ఆరోగ్య వ్యవస్థలో మందుల ధరలు అధికంగా ఉండటం దురదృష్టకరమని కొందరు వ్యాఖ్యానించారు. భారత్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స కూడా అందుబాటులో ఉంటుందని మరికొందరు గుర్తు చేశారు. యూరప్‌తో పోల్చినా భారత్‌లో జనరిక్ మందులు చాలా తక్కువ ధరకు దొరుకుతాయని పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. కొందరు అయితే మందులు కొనుగోలు చేయడానికి అమెరికన్లు భారత్‌కు వచ్చినా ఖర్చు తక్కువగానే ఉంటుందని వ్యాఖ్యానించారు.

### ఇంతకుముందూ ఇలాంటి వ్యాఖ్యలే

ఇటీవల విక్టోరియా అనే మరో అమెరికన్ మహిళ కూడా తమ దేశ ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. అమెరికాలో వెయ్యి డాలర్లకు లభించే ఒక ఔషధాన్ని భారత్ నుంచి కేవలం 25 డాలర్లకే కొనుగోలు చేసినట్లు తెలిపారు. బీమా సంస్థ చికిత్స ఖర్చును భరించకపోవడంతో భారతీయ తయారీదారు నుంచి మందు తెప్పించుకున్నట్లు చెప్పారు. అమెరికా ఆరోగ్య వ్యవస్థ సాధారణ ప్రజలపై భారీ ఆర్థిక భారం మోపుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వరుస ఘటనలు ప్రపంచవ్యాప్తంగా మందుల ధరలు, ఆరోగ్య సేవల వ్యయం, జనరిక్ ఔషధాల ప్రాధాన్యంపై మరోసారి చర్చకు దారితీశాయి.

# ఈడీ సంచలన నిర్ణయం

- స్వాధీనం చేసుకున్న విమానం ఈ-వేలం

దేశంలో తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈవేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ కార్యాలయం స్వాధీనం చేసుకున్న హాకర్ 800ఏ విమానాన్ని ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలానికి పెట్టింది. జూలై 1న నిర్వహించిన ఈవేలంలో విమానం రూ.3 కోట్లకు అమ్ముడైంది. స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### భారీ మోసం కేసులో స్వాధీనం

ఈ హాకర్ 800ఏ విమానం ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినదిగా ఈడీ గుర్తించింది. నకిలీ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో సుమారు రూ.792 కోట్ల పెట్టుబడి మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టిన అధికారులు 2025 మార్చి 7న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### చట్టపరమైన అనుమతులతో వేలం

విమానాన్ని విక్రయించే ముందు అన్ని చట్టపరమైన ప్రక్రియలను ఈడీ పూర్తి చేసింది. పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతి పొందిన తర్వాతే ఈవేలానికి తీసుకువచ్చింది. పారదర్శక విధానంలో నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో అత్యధిక ధర పలికిన బిడ్డర్‌కు విమానాన్ని విక్రయించారు. స్వాధీనం చేసిన ఆస్తులను బాధితులకు ప్రయోజనం చేకూరేలా వినియోగించాలన్న లక్ష్యంతో ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### బాధితులకు నిధుల పంపిణీ

విమానం విక్రయం ద్వారా వచ్చిన రూ.3 కోట్ల మొత్తాన్ని బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించే ప్రక్రియలో వినియోగించనున్నట్లు ఈడీ వెల్లడించింది. మోసపోయిన పెట్టుబడిదారులకు వీలైనంత త్వరగా న్యాయం చేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన అధికారులు, మిగిలిన ఆస్తులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు.

### పారదర్శకతకు కొత్త మార్గం

స్వాధీనం చేసుకున్న ఆస్తులను ఆన్‌లైన్ ఈవేలం ద్వారా విక్రయించడం వల్ల పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. పోటీ వాతావరణంలో ఎక్కువ ధర లభించే అవకాశం ఉండటంతో ప్రభుత్వానికి కూడా ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.

# కోల్‌కతాలో సంచలనం

- తృణమూల్‌లో తారాస్థాయికి తిరుగుబాటు
- పార్టీ కార్యాలయంపై రెబల్ వర్గం ఆధిపత్యం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత విభేదాలు కొత్త మలుపు తీసుకున్నాయి. పార్టీలో తిరుగుబాటు చేస్తున్న రితబ్రత బెనర్జీ వర్గం కోల్‌కతాలోని ప్రధాన పార్టీ కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. పలువురు ఎమ్మెల్యేలతో కలిసి కార్యాలయానికి చేరుకున్న రెబల్ నేతలు గేట్ల తాళాలు మార్చి, కొత్త పోస్టర్లు ఏర్పాటు చేసి, లోపల సమావేశం నిర్వహించారు. ఇకపై ఇదే తమ అధికారిక ప్రధాన కార్యాలయంగా పనిచేస్తుందని ప్రకటించారు.

### కొత్త పోస్టర్లు... కొత్త ప్రకటన

కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ చైర్మన్‌గా పేర్కొంటూ పోస్టర్లు ఏర్పాటు చేశారు. భవనంలో ఉన్న మమతా బెనర్జీ ఫొటోలు, కటౌట్లు మాత్రం అలాగే ఉంచారు. పార్టీ ఖజానాదారు అక్రుజ్జమాన్ మాట్లాడుతూ ఈ కార్యాలయంతో కార్యకర్తలకు భావోద్వేగ అనుబంధం ఉందన్నారు. భవనం యాజమాన్యంతో ఒప్పంద ప్రక్రియ పూర్తైందని, ఇకపై అన్ని సంస్థాగత కార్యకలాపాలు ఇక్కడి నుంచే నిర్వహిస్తామని వెల్లడించారు. శనివారం నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభిస్తామని రితబ్రత బెనర్జీ ప్రకటించారు.

### మమత వర్గానికి ఎదురుదెబ్బ

రెబల్ వర్గం కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిన వెంటనే మమతా బెనర్జీకి విధేయులైన ఎమ్మెల్యేలు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే గేట్లకు తాళాలు వేయడంతో వారు లోపలికి వెళ్లలేకపోయారు. ఈ ఘటనపై స్పందించిన సీనియర్ నేత కునాల్ ఘోష్ దీనిని దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పార్టీ ఎమ్మెల్యేలకు కార్యాలయానికి వచ్చే హక్కు ఉందని, తాళాలు వేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన సమయంలో కొందరు ఇతరుల చేతిలో కీలుబొమ్మల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

### ఎన్నికల సంఘం ముందుకు వివాదం

ఈ పరిణామాలకు ఒక రోజు ముందే రితబ్రత బెనర్జీ వర్గం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి పార్టీ పేరు, ఎన్నికల గుర్తు, సంస్థాగత నిర్మాణం, ఆస్తులపై తమ హక్కును వినిపించింది. అనంతరం ఎన్నికల సంఘం రెండు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. సంస్థాగత ఎన్నికలు, అధికార ప్రతినిధులు, పార్టీపై నియంత్రణకు సంబంధించిన పత్రాలు, వాదనలు జూలై 6 సాయంత్రం 5:30 గంటలలోపు సమర్పించాలని ఆదేశించింది.

# ఆత్మరక్షణ.. హత్య.. చట్టం!

- మామను చంపిన కోడలు... నేరస్తురాలా.. ?
- లేక తన గౌరవాన్ని కాపాడుకున్న మహిళా..?
- చెన్నై ఘటనతో చట్టపరమైన చర్చ

ఒక మహిళకు ఇల్లు అంటే భద్రతకు ప్రతీక కావాలి. కుటుంబం అంటే అండగా నిలిచే మనుషులు ఉండాలి. కానీ అదే ఇల్లు భయానికి నిలయంగా మారితే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. కుటుంబ సభ్యుడే పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడితే, చివరకు తనను తాను రక్షించుకునే ప్రయత్నంలో ఒక ప్రాణం పోతే... ఆ మహిళను నేరస్తురాలిగా చూడాలా? లేక పరిస్థితుల బలిగా భావించాలా? అనే ప్రశ్నలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. చెన్నైలో వెలుగుచూసిన ఈ ఘటన చట్టం, న్యాయం, మహిళల భద్రతపై మరోసారి దృష్టి సారించేలా చేసింది.




### వేధింపుల ఆరోపణలతో వివాదం

28 ఏళ్ల మహిళ తన భర్త కుటుంబంతో కలిసి నివసిస్తోంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కుటుంబంలోని పెద్దవాడైన మామ కొంతకాలంగా ఆమెను లైంగికంగా వేధిస్తున్నట్లు మహిళ వాంగ్మూలంలో పేర్కొంది. తాను ఇంటి ఖర్చులు భరిస్తున్నాననే ఆధిపత్యంతో అసభ్యంగా ప్రవర్తిస్తూ పదేపదే ఒత్తిడి చేసినట్లు ఆమె తెలిపింది. ఇది ఒక్కరోజు జరిగిన విషయం కాదని, చాలా రోజులుగా మానసిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు వివరించింది. ఈ పరిస్థితిని మహిళ ముందుగా కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. అత్తకు జరిగిన విషయాన్ని చెప్పడంతో కుటుంబంలో వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత అత్త ఇంటిని విడిచి వెళ్లిపోయినా మహిళ ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం ఆగలేదని దర్యాప్తులో వెల్లడైంది.

### ఆత్మరక్షణలో జరిగిన ఘర్షణ

జూలై 1న మామ మరోసారి లైంగికంగా వేధించేందుకు ప్రయత్నించినట్లు మహిళ పోలీసులకు తెలిపింది. తనపై దాడి జరిగే ప్రమాదం ఉందని భావించి ఆమె ప్రతిఘటించింది. ఆ ఘర్షణలో మామ మరణించాడు. ఘటన అనంతరం మహిళ జరిగిన విషయాన్ని దాచకుండా పోలీసులకు వివరించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్య కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు చేసిన వెంటనే అరెస్టు చేయకుండా, సంఘటన జరిగిన పరిస్థితులు, మహిళ వాంగ్మూలం, లభ్యమైన ఆధారాలను పరిశీలిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు.

### హత్య కేసు నమోదైనా అరెస్టు ఎందుకు లేదు?

సాధారణంగా హత్య కేసు నమోదైతే అరెస్టు జరుగుతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అయితే ప్రతి హత్య కేసును ఒకే విధంగా చట్టం చూడదు. మరణానికి దారితీసిన పరిస్థితులు కూడా కీలకంగా పరిగణించబడతాయి. భారతీయ చట్టం ప్రకారం ప్రతి వ్యక్తికి ఆత్మరక్షణ హక్కు ఉంది. తన ప్రాణం, శరీరం, గౌరవాన్ని కాపాడుకునే క్రమంలో అవసరమైన మేరకు బలప్రయోగం చేసే హక్కును చట్టం గుర్తిస్తుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆ బల ప్రయోగం కారణంగా మరణం సంభవించినా, అది ప్రతి సందర్భంలోనూ నేరంగా పరిగణించబడదు. అయితే నిజంగా ఆత్మరక్షణ కోసమే జరిగిందా? లేక ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అనే అంశాన్ని దర్యాప్తు, కోర్టు విచారణ ఆధారంగా మాత్రమే నిర్ణయిస్తారు.

### తుది నిర్ణయం కోర్టుదే

పోలీసులు మహిళను అరెస్టు చేయకపోవడం ఆమె నిర్దోషి అని అర్థం కాదు. అదే విధంగా హత్య కేసు నమోదు కావడం వల్ల ఆమె నేరం చేసినట్లు కూడా వెంటనే తేలిపోదు. దర్యాప్తు పూర్తైన తర్వాత కేసు కోర్టుకు వెళ్తుంది. అక్కడ ఫోరెన్సిక్ నివేదికలు, సాక్ష్యాలు, వాంగ్మూలాలు, ఘటనకు సంబంధించిన అన్ని పరిస్థితులను పరిశీలించిన తర్వాత మాత్రమే ఇది ఆత్మరక్షణలో జరిగిన చర్యా? లేక చట్టరీత్యా శిక్షార్హమైన నేరమా? అన్నది తేలుతుంది. అందుకే ఈ కేసులో కోర్టు తీర్పే కీలకం కానుంది.

# కియాతో అభివృద్ధి... బ్రాహ్మణీ స్టీల్స్‌తో అవినీతి

- స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు కొత్త దిశ: చంద్రబాబు

రాయలసీమ అభివృద్ధికి పరిశ్రమలే ప్రధాన బలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగులో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. రాయలసీమ ఇక కరవు ప్రాంతం కాదని, జలకళతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని చెప్పారు. హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, గోల్డ్ ఫీల్డ్స్, ఆటోమొబైల్, డ్రోన్లు, రక్షణ రంగ పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ ఆధారంగా ఉక్కు ఉత్పత్తి చేసే ఈ స్టీల్ ప్లాంట్ రాయలసీమ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని తెలిపారు.

### కియా విజయాన్ని గుర్తుచేసిన సీఎం

2017లో తీవ్ర పోటీ మధ్య అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకొచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. 536 ఎకరాల భూమి కేటాయించి, అవసరమైన నీటి సదుపాయాలు కల్పించి పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. ప్రస్తుతం కియా సంస్థ 19 లక్షల కార్లను ఉత్పత్తి చేయగా, అందులో మూడు లక్షల కార్లు 90 దేశాలకు ఎగుమతి అయ్యాయని తెలిపారు. కియా రాకతో అనంతపురం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు, ప్రాంతానికి ఆర్థికాభివృద్ధి రెండూ సాధ్యమవుతాయని వ్యాఖ్యానించారు.

### బ్రాహ్మణీ స్టీల్స్‌పై విమర్శలు

బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో గతంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 2007లో 14 వేల ఎకరాల భూములు కేటాయించినా స్టీల్ ప్లాంట్ మాత్రం నిర్మించలేదన్నారు. క్యాప్టివ్ మైనింగ్ పేరుతో ఓబుళాపురం గనుల నుంచి ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు అక్రమంగా తరలించారని విమర్శించారు. రాష్ట్రానికి ఉపయోగపడాల్సిన సహజ సంపదను దోపిడీ చేశారని ఆరోపించారు. చివరకు అక్రమాలకు పాల్పడిన వారు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. బ్రాహ్మణీ స్టీల్స్ ఘటన అవినీతికి నిదర్శనమైతే, కియా పరిశ్రమ అభివృద్ధికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

# బంగారానికి మళ్లీ రెక్కలు

**ఒక్కరోజులో భారీగా పెరిగిన ధర**

**లక్షన్నర దాటిన 10 గ్రాములు**

కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు ఒక్కసారిగా మళ్లీ ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన డిమాండ్ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు భారీగా పెరిగాయి. ఒక్కరోజులోనే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.3,300కు పైగా పెరిగి మళ్లీ లక్షా యాభై వేల రూపాయల మార్కును దాటింది. వెండి కూడా అదే బాటలో పయనిస్తూ కిలోకు రూ.5 వేల మేర పెరిగింది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి షాక్ తగిలింది.

### తాజా ధరలు ఎలా ఉన్నాయి?

దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,500 నుంచి రూ.1,50,800కు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పెరిగింది. వెండి ధర కిలోకు రూ.2.40 లక్షల నుంచి రూ.2.45 లక్షలకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు ధర కూడా 2.44 శాతం పెరిగి 62.45 డాలర్లకు చేరుకుంది.

### పెరుగుదలకు కారణాలివే

ఇటీవల గరిష్ఠ స్థాయిల నుంచి దాదాపు పది శాతం వరకు



తగ్గిన బంగారం ధరలు మరింత పడిపోతాయని భావించిన చాలామంది తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించారు. అయితే తాజా అంతర్జాతీయ పరిణామాలు మళ్లీ పసిడికి ఊతమిచ్చాయి. అమెరికాలో వడ్డీ రేట్ల పెంపుపై ఉన్న ఆందోళనలు తగ్గడం, డాలర్ విలువ బలహీనపడటం, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోందనే సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులు మళ్లీ బంగారం వైపు మొగ్గు చూపారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి.

### జులై 8పై మార్కెట్ దృష్టి

అమెరికా ఫెడరల్ రిజర్వ్ విడుదల చేయనున్న జులై 8 ఫెడ్ మినిట్స్‌పై ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్ దృష్టి కేంద్రీకృతమైంది. ఆ నివేదికలో వచ్చే సంకేతాల ఆధారంగా బంగారం ధరలు మరోసారి మారే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వడ్డీ రేట్లపై సానుకూల సంకేతాలు కొనసాగితే పసిడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# జట్టు నిర్ణయమే ఫైనల్

## వైభవ్ అరంగేట్రంపై విమర్శలు బీసీసీఐ ఉపాధ్యక్షుడి స్పష్టత

ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంపై వస్తున్న విమర్శలకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై అనవసర వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. జట్టులో ఎవరికి అవకాశం ఇవ్వాలన్న తుది నిర్ణయం కోచ్, కెప్టెన్‌దేనని స్పష్టం చేశారు. పరిస్థితులను బట్టి సరైన సమయంలో వైభవ్‌కు తప్పకుండా అవకాశం లభిస్తుందని తెలిపారు. ఐపీఎల్ 2026లో 16 ఇన్నింగ్స్‌లో 776 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన వైభవ్ అసాధారణ ప్రతిభావంతుడని కొనియాడారు. అందుకే జాతీయ టీ20 జట్టులో చోటు దక్కిందన్నారు. అయితే తొలి జట్టులో ఎప్పుడు ఆడించాలన్నది పూర్తిగా జట్టు యాజమాన్యం నిర్ణయమని చెప్పారు. ఇప్పటికే ఐర్లాండ్ సిరీస్‌లో కూడా వైభవ్ బెంచ్‌కే పరిమితం కావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. అయినా యువ ఆటగాడి భవిష్యత్తు ఎంతో ప్రకాశవంతంగా ఉందని, సరైన సమయంలో భారత జట్టుకు అతను కీలక ఆటగాడిగా మారతాడని రాజీవ్ శుక్లా విశ్వాసం వ్యక్తం చేశారు.

# సంజూను తప్పించొద్దు

- వైభవ్‌కు అవకాశం : పుజారా




భారత టీ20 జట్టులో సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ ఎంపికపై కొనసాగుతున్న చర్చకు మాజీ క్రికెటర్ చటేశ్వర్ పుజారా స్పందించారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో సంజూ వరుసగా 5, 0, 1 పరుగులకే పరిమితమైనా అతడిపై నమ్మకం కోల్పోవద్దని సూచించారు. టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంజూకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అతనిపై అనవసర ఒత్తిడి సృష్టించకుండా సహజమైన ఆట ఆడేలా అవకాశం కల్పించాలని చెప్పారు. మరోవైపు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ జట్టులో చోటు దక్కించుకునే అర్హత ఉన్న ఆటగాడేనని పేర్కొన్నారు. అయితే వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో సంజూ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ వంటి కీలక ఆటగాళ్లను తప్పించడం సరైన నిర్ణయం కాదన్నారు. అవసరమైతే విశ్రాంతి ఇచ్చి అవకాశం కల్పించాలే తప్ప నిరూపించుకున్న ఆటగాళ్లను పక్కన పెట్టకూడదని సూచించారు. అలాగే ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒత్తిడిలో ఆడిన ఇన్నింగ్స్‌ను పుజారా ప్రశంసిస్తూ, నాయకుడిగా ముందుండి జట్టును గట్టెక్కించాడని కొనియాడారు.

# వైభవ్‌ను అతిగా పొగడొద్దు

- కపిల్ దేవ్ కీలక సూచన

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పెరుగుతున్న అంచనాలపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించారు. వైభవ్ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడేనని, అయితే ఇప్పుడే అతడిని అతిగా పొగడటం మంచిది కాదని సూచించారు. టీ20 ఫార్మాట్‌లో అతడి ప్రతిభ సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ స్థాయిలో కనిపిస్తోందని ప్రశంసించిన కపిల్, వన్డేలు, టెస్టుల్లో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉందన్నారు. చిన్న వయసులోనే అతడిపై భారీ అంచనాలు పెంచితే ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. మరోవైపు వైభవ్ నిజంగా సిద్ధంగా ఉంటే వయసును కాకుండా ప్రతిభను చూడాలని సూచించారు. సచిన్ కూడా చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చి తన ప్రతిభను నిరూపించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20 వర్షం కారణంగా రద్దవడంతో రెండో మ్యాచ్‌లో వైభవ్‌కు అవకాశం దక్కుతుందా అనే ఆసక్తి నెలకొంది. అభిమానులు అతడి అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న వేళ కపిల్ దేవ్ చేసిన వ్యాఖ్యలు భారత క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.






రిటైర్మెంట్‌పై క్లారిటీ

# స్టోక్స్ భావోద్వేగ వీడ్కోలు

**15 ఏళ్ల ప్రయాణానికి ముగింపు**




ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భావోద్వేగ సందేశాన్ని అభిమానులతో పంచుకున్నాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం పూర్తిగా వ్యక్తిగతమైందేనని, ఎలాంటి ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేశాడు. తన కెరీర్‌కు ఇదే సరైన సమయమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 2011లో ప్రారంభమైన 15 ఏళ్ల అంతర్జాతీయ ప్రయాణంలో ఎన్నో విజయాలు, పరాజయాలు, మధుర జ్ఞాపకాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రతి క్షణాన్ని ఆస్వాదించానని తెలిపాడు. అభిమానులు, సహచర ఆటగాళ్లు, కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతు ఎప్పటికీ మరువలేనిదని అన్నాడు. ఇకపై మైదానంలో ఆటగాడిగా కాకుండా ప్రేక్షకుడిగా జట్టుకు మద్దతు ఇస్తానని చెప్పాడు. న్యూజిలాండ్‌తో ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరిగిన మూడో టెస్టు అనంతరం స్టోక్స్ రిటైర్మెంట్ ప్రకటించాడు. నాలుగేళ్ల పాటు టెస్టు కెప్టెన్‌గా సేవలందించిన స్టోక్స్ ఇంగ్లాండ్ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. ఆయన నిర్ణయానికి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, మాజీ క్రికెటర్లు అభినందనలు తెలియజేస్తున్నారు.

# ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 ` 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో



తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుముకుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి. కానీ, సినిమాలో వేగం కనిపించదు. ప్రేక్షకుడికి అసలు కథేంటన్నది అంతుచిక్కడానికి విరామం వరకు వేచి చూడాల్సి వస్తుంది. భువనాలయ ప్రపంచం.. అందులోని రావు బహదూర్ జీవితం.. అతని గతం.. రేణుకతో ప్రేమాయణం అన్నీ నెమ్మదిగా సాగిపోతుంటాయి.

# మా ఇంటి బంగారం

## ఓ మంచి సినిమా: సమంతకు కంగ్రాట్స్ చెప్పిన లెనిన్ అఖిల్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా అఖిల్‌తో సమంతకు ఉన్న ఈ రిలేషన్ పరస్పర గౌరవం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదన్నాడు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.






# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

**బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా**

బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరపు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ నాణ్యత పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి బ్లాక్ చేయాలనే నిబంధనలు విధించవద్దని కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణ కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే తొలగించేలా ఒక ప్రాక్టికల్ ప్రోటోకాల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# హృతిక్, సుసానే విడాకులు

## భరణంగా 400 కోట్లు అంటూ వైరల్



హృతిక్ రోషన్, సుసానే ఖాన్ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. విడాకుల తర్వాత సుసానే రూ.400 కోట్ల భరణం డిమాండ్ చేశారనే వార్తలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆమె సోదరి ఫరాఖాన్ తాజాగా స్పందించారు. ఈ విడాకులు ఇరు వర్గాల అంగీకారంతోనే జరిగాయని.. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. హృతిక్ సుసానే విడాకులపై సోషల్ మీడియాలో, బయటా పెద్ద రచ్చ జరిగింది. వారి వ్యక్తిగత జీవితంపై చాలా మంది రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కానీ, వారిద్దరూ ఆ క్లిష్ట పరిస్థితిని ఎంతో గౌరవప్రదంగా, హుందాగా ఎదుర్కొన్నారు. ఇక.. సుసానే రూ.400 కోట్ల భరణం తీసుకున్నారన్న వార్తల్లో నిజం లేదు. భరణం తీసుకుని ఆమె మరింత ధనవంతురాలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు. అవి చూసి నా మనసు ఎంతో బాధపడుతోంది. ఆ వార్తలు పచ్చి అబద్ధం అని స్పష్టం చేశారు. దీంతో ఈ వార్తలకు బ్రేక్ పడింది. హృతిక్ రోషన్, సుసానే ఖాన్ డిసెంబర్ 2014లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు (రెహాన్, హ్రిదాన్) ఉన్నారు. విడాకులు తీసుకున్నప్పటికీ.. తాము మంచి స్నేహితులుగా ఉంటూ తమ పిల్లల బాధ్యతలను చూసుకుంటున్నట్లు హృతిక్ తెలిపారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085